మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 22-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 54 Issue: 54

22 ఆగస్టు 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:04 సూర్యాస్తమయం - సా. 6:33 తిథి దశమి రా. 2:00o వరకు తరువాత ఏకాదశి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం జ్యేష్ఠ మ. 2:41 వరకు తరువాత మూల యోగం విష్కంభ ఉ. 6:13o వరకు కరణం తైతుల మ. 12:48 వరకు గరజి రా. 2:00o వరకు వర్జ్యం రా. 11:47 నుండి రా. 1:35 వరకు దుర్ముహూర్తం ఉ. 7:44 నుండి ఉ. 8:34 వరకు రాహుకాలం ఉ. 9:11 నుండి ఉ. 10:45 వరకు యమగండం మ. 1:52 నుండి మ. 3:26 వరకు గుళికాకాలం ఉ. 6:04 నుండి ఉ. 7:37 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:28 నుండి తె. 5:16 వరకు అమృత ఘడియలు తె. 4:55 నుండి ఉ. 6:43 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:54 నుండి మ. 12:44 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial



# చక్కెర చిక్కులు

## దిగుమతుల బాటలో భారత్

**పదేళ్ల తర్వాత విదేశీ చక్కెరపై ఆధారం.. ధరలకు కళ్లెం వేసేందుకు కేంద్రం నిర్ణయం**

ప్రపంచంలోనే అత్యధికంగా చక్కెరను వినియోగించే భారత్.. ఇప్పుడు అదే చక్కెరను విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పరిస్థితికి చేరింది. దేశీయ మార్కెట్‌లో చక్కెర ధరలు రికార్డు స్థాయికి చేరడంతో ధరలకు కళ్లెం వేసేందుకు కేంద్ర ప్రభుత్వం పదేళ్ల తర్వాత తొలిసారిగా భారీ స్థాయిలో ముడి చక్కెర దిగుమతులకు తలుపులు తెరిచింది. అక్టోబర్ 31 వరకు 10 లక్షల టన్నుల ముడి చక్కెరను ఎలాంటి దిగుమతి సుంకం లేకుండా తీసుకొచ్చేందుకు అనుమతించింది.

న్యూఢిల్లీ: ఈ నిర్ణయం సాధారణ దిగుమతి విధానంలో మార్పు మాత్రమే కాదు.. దేశీయ చక్కెర సరఫరా వ్యవస్థపై ఏర్పడిన ఒత్తిడికి స్పష్టమైన సంకేతంగా మారింది. పండుగల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉండటంతో ముందుగానే సరఫరాను పెంచి ధరలను నియంత్రించేందుకు కేంద్రం ఈ చర్య చేపట్టింది. దేశీయ చక్కెర ధరలు గత రెండు నెలల్లో దాదాపు 40 శాతం పెరిగినట్లు రాయిటర్స్ నివేదించింది. ఉత్పత్తి తగ్గడం, మార్కెట్‌లో అందుబాటులో ఉన్న నిల్వలు క్షీణించడం, పండుగల సమయంలో వినియోగం పెరగడం ధరలపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. ఆగస్టు నుంచి నవంబర్ వరకు వినాయక తరువాయి 2 వ పేజీలో...



ఆకాశం వైపు ఆశగా చూస్తున్న రైతన్నకు వరుణుడు ముఖం చాటేస్తున్నాడు. పంటలతో పచ్చగా కళకళలాడాల్సిన పొలాలు నెమ్మదిగా నెర్రెలు బారుతున్నాయి. జూన్, జూలైలో కురవాల్సిన వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం.. ఆ తర్వాత కూడా వరుణుడి జాడ కనిపించకపోవడంతో తెలుగు రాష్ట్రాల్లో సాగు పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నాయి. మరోవైపు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే పెరగడంతో భూమిలో తేమ వేగంగా ఆవిరైపోతోంది. విత్తనాలు చల్లిన రైతులు మొలకల కోసం.. మొలకెత్తిన రైతులు పంట బతుకుదెరువు కోసం.. ఇప్పటికే నాట్లు వేసిన వారు నీటి కోసం ఆకాశం వైపు చూస్తున్నారు.

# చినుకమ్మ అలకలు

## తెలుగు రాష్ట్రాల్లో వర్షాభావం

**పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. ఎండుతున్న పొలాలు**

**నెరవేరని సాగు ఆశలు.. ఆకాశం వైపు అన్నదాత చూపు**

(ఈవార్తలు - గ్రౌండ్ రిపోర్ట్)

వ్యవసాయానికి అత్యంత కీలకమైన సమయంలో వర్షాలు ముఖం చాటేయడం అన్నదాతను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. వానలపై ఆధారపడి సాగు చేసే రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. సాధారణంగా తొలకరి వర్షాలతో పొలాల్లో తేమ ఏర్పడి సాగు పనులు వేగం పుంజుకోవాలి. కానీ అనేక ప్రాంతాల్లో వర్షాలు ఆలస్యం కావడం లేదా ఒకసారి కురిసి మళ్లీ విరామం ఇవ్వడంతో రైతులు అయోమయంలో పడ్డారు. విత్తనాలు, ఎరువులు, దుక్కులు, కూలీల కోసం ఇప్పటికే డబ్బులు ఖర్చు చేసిన రైతుకు ఇప్పుడు తరువాయి 2 వ పేజీలో...

# సురేఖకు ఉద్వాసన!?

**కొండాను బర్తరఫ్ చేయాల్సిందే**

**కోమటిరెడ్డి, చిన్నారెడ్డిపైనా కఠిన చర్యలు**

**కాంగ్రెస్ ఎమ్మెల్యేల డిమాండ్**

**15 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎమ్మెల్సీల భేటీ**

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను భర్తరఫ్ చేయాలని పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఏకంగా 20 మందికి పైగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సీఎల్పీ వేదికగా మీడియా సమావేశం నిర్వహించి.. కొండా సురేఖపై కఠిన చర్యలు తీసుకోవాలని పార్టీ అధిష్ఠానాన్ని కోరారు.



హైదరాబాద్, ఆగస్టు 21 (ఈవార్తలు): సీఎల్పీలో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల అయిలయ్య, ప్రభుత్వ విప్‌లు బల్మూరి వెంకట్, వేముల వీరేశం సహా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కొండా సురేఖ కుటుంబంపై తరువాయి 2 వ పేజీలో...

# రేవంత్ వచ్చాక మాట్లాడతా

## క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇచ్చా

**మంత్రి కొండా సురేఖ వెల్లడి**

తన కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన షోకాజ్ నోటీసుపై తెలంగాణ మంత్రి కొండా సురేఖ స్పందించారు. ఈ విషయంపై తాను చెప్పాల్సింది ఇప్పటికే క్రమశిక్షణ కమిటీకి వివరించానని, ప్రస్తుతం మీడియా ముందు మాట్లాడేదేమీ లేదని ఆమె స్పష్టం చేశారు.

హైదరాబాద్, ఆగస్టు 21 (ఈవార్తలు: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాత అన్ని విషయాలపై స్పందిస్తానని ఆమె తెలిపారు. వరంగల్ జిల్లా గీసుకొండలో మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు పార్టీలో తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి తరువాయి 2 వ పేజీలో...



# నా టార్గెట్ రేవంత్

## ఆయన మాట్లాడాక నేను స్పందిస్తా

**నా వ్యాఖ్యలకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నా.. కొండా సుస్మిత పునరుద్ఘాటన**

వరంగల్, ఆగస్టు 21 (ఈవార్తలు): సీఎం రేవంత్‌రెడ్డే తన టార్గెట్ అని అని మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ పునరుద్ఘాటించారు. ఇటీవల తాను సీఎంపై చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని ఆమె స్పష్టం చేశారు. వాటిపై సీఎం రేవంత్‌రెడ్డి ఏం మాట్లడుతారో చూశాకే స్పందిస్తానని చెప్పారు. అంతేకానీ తన తల్లి మంత్రి కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు చేసిన వ్యాఖ్యలకు తాను తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.16,048 |
| వెండి (కిలో): | రూ.2,65,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,742 |

# ఎకరం రూ.264 కోట్లు



## రాయదుర్గంలో ఆల్ టైమ్ రికార్డు ధర

**ఒక్క ప్లాట్ వేలంతో టీజీఐఐసీకి రూ. 1,386 కోట్ల ఆదాయం**

**గత మే నెలలో నమోదైన రూ. 237 కోట్ల రికార్డు బద్దలు**

**ఆగస్టు 28న మరో ప్లాట్‌కు వేలం జరగనున్నట్లు ప్రకటన**

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో సరికొత్త రికార్డు నమోదైంది. రాయదుర్గంలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ నిర్వహించిన వేలంలో ఎకరా భూమి ఏకంగా రూ. 264 కోట్లు పలికింది. మొత్తం 5.25 ఎకరాల ప్లాట్ విక్రయం ద్వారా ప్రభుత్వ సంస్థ అయిన టీజీఐఐసీకి రూ. 1,386 కోట్ల భారీ ఆదాయం సమకూరింది.

హైదరాబాద్, ఆగస్టు 21 (ఈవార్తలు):హైదరాబాద్‌లో భూమి ధరకు సంబంధించి ఇదే ఆల్ టైమ్ రికార్డ్. రాయదుర్గం పాన్‌మక్తాలోని సర్వే నెం. 83/1లో ఉన్న ప్లాట్ నెం. ౹ా1 కోసం శుక్రవారం ఈ-వేలం నిర్వహించారు. ఎకరాకు రూ. 175 కోట్ల కనీస ధరతో వేలం ప్రారంభించగా, దానిపై ఏకంగా 50.9 శాతం అధికంగా ధర పలికింది. ఇదే కారిడార్‌లో గత మే నెలలో టీజీఐఐసీ నిర్వహించిన వేలంలో ఎకరాకు రూ. 237 కోట్లు పలికింది. తాజా వేలంలో ఆ రికార్డు బద్దలైంది. హైదరాబాద్ ఐటీ, నాలెడ్జ్ సిటీ గ్రోత్ కారిడార్‌లో ఈ భూమి ఉండటం దీనికి ప్రధాన కారణం. ఐటీసీ కోహినూర్ తరువాయి 2 వ పేజీలో...



# రేవంత్.. దా ఇగ!

**అమెరికా టూర్‌కు అనుమతివ్వం**

**పర్యటన.. హోదాకు, ఉద్దేశంలో తేడా**

**కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడి**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన చివరి నిమిషంలో రద్దయింది. అమెరికాలో నిర్వహించాల్సిన 'తెలంగాణ రైజింగ్' సమావేశాలకు కేంద్ర విదేశాంగ శాఖ అనుమతి ఇవ్వకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీంతో బ్రిటన్ పర్యటన ముగించుకొని సీఎం ఈ నెల 23న లండన్ నుంచి నేరుగా హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు.

హైదరాబాద్/న్యూఢిల్లీ, ఆగస్టు 21 (ఈవార్తలు): తెలంగాణకు భారీ పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి లండన్, అమెరికాలో 'తెలంగాణ రైజింగ్' పేరుతో సమావేశాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా అమెరికాలోని బోస్టన్, న్యూయార్క్‌లో సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి కార్యాలయం షెడ్యూల్ కూడా సిద్ధం చేసింది. అయితే చివరి నిమిషంలో కేంద్ర తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



సూర్యుడికి అత్యంత సమీపంలోని మెర్క్యురీపై వాతావరణం దాదాపు లేకపోవడంతో పగటిపూట 430 డిగ్రీలు, రాత్రిపూట -180 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. గ్రహానికి భూమి కంటే బలహీనమైన అయస్కాంత క్షేత్రం ఉన్నప్పటికీ, ధ్రువ ప్రాంతాల్లోని శాశ్వత నీడలో ఉన్న గుంతల్లో నీటి మంచు ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. వాతావరణం గ్రహ ఉష్ణోగ్రతలను నియంత్రించడంలో ఎంత కీలకమో మెర్క్యురీ పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి.

# 1600 మెడికల్ సీట్లు గాయబ్!

**జీవో 150తో నీట్ విద్యార్థులకు తీవ్ర అన్యాయం**

**టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన**

హైదరాబాద్, ఆగస్టు 21 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 150తో తెలంగాణ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఈ జీవో 150పై నీట్ అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పలువురు నీట్ అభ్యర్థుల తల్లిదండ్రులు కల్వకుంట్ల కవితను కలిసి తమ సమస్యలను వివరించారు. ఆ తర్వాత ఆమె ప్రభుత్వం అనాలోచితంగా నిర్ణయం తీసుకుందని విమర్శించారు. కేవలం 4 ఏళ్లు తెలంగాణలో చదివినతరువాయి 2 వ పేజీలో...






# 'అంతరిక్ష' అడ్డా భారత్

**ప్రపంచ కేంద్రంగా మారాలి.. స్పేస్ స్టార్టప్‌లకు మోదీ పిలుపు**

న్యూఢిల్లీ: అంతరిక్ష రంగంలో ప్రపంచ ప్రతిభకు, కంపెనీలకు, పెట్టుబడులకు భారత్ ఒక ఆకర్షణ కేంద్రంగా మారుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయ పడ్డారు. వివిధ రంగాలలో అంతరిక్ష సాంకేతికతల విస్తృత అనువర్తనాలను అన్వేషించాలని స్పేస్ స్టార్టప్‌లను కోరారు. అంతరిక్ష రంగంలో ప్రతిభకు, పెట్టుబడులకు దేశాన్ని ప్రపంచ కేంద్రంగా మార్చాలని అన్నారు. శుక్రవారం నాడు సేవా తీర్థ్ (పీఎం కార్యాలయం)లో 20 స్పేస్ స్టార్టప్‌ల తరువాయి 2 వ పేజీలో...



# ఇందిరమ్మ ఇళ్ల 'క్యూర్' అర్హత జాబితా విడుదల

**మొత్తం 7,340 ఇళ్లకు 60,720 దరఖాస్తులు**

హైదరాబాద్, ఆగస్టు 21 (ఈవార్తలు): 'క్యూర్' ఏరియా పరిధిలోని ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ప్రాథమిక అర్హుల జాబితాను విడుదల చేసింది. ఈ పథకం కింద మొత్తం 7,340 ఇళ్లను కేటాయించాల్సి ఉండగా, -2 వ పేజీలో...

# రాశి ఫలాలు
22.8.2026

**మేషం:** కుటుంబ సభ్యుల ప్రవర్తన కొంత నిరుత్సాహపరుస్తుంది. వృధా ఖర్చులు పెరుగుతాయి. ధన పరంగా చేసే ప్రయత్నాలు కలసిరావు. వ్యాపారాలలో శ్రమ పెరుగుతుంది ఉద్యోగమున స్థానచలన సూచనలున్నవి. ఇతరులతో అకారణ విభేదాలు కలుగుతాయి. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

**వృషభం:** ప్రయాణాలలో ఆర్థిక లాభాలు కలుగుతాయి. ఉద్యోగమున అధికారుల అనుగ్రహంతో ఉన్నత హోదాలు పొందుతారు. ముఖ్యమైన వ్యవహారాలలో స్వంత ఆలోచనలు కలసివస్తాయి. స్థిరాస్తి క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది.

**మిథునం:** వృత్తి వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. బంధు మిత్రుల రాకతో గృహమున సందడి వాతావరణం నెలకొంటుంది. సమాజంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉద్యోగమున పని ఒత్తిడి ఉన్నప్పటికీ సకాలంలో పనులు పూర్తి చేస్తారు.

**కర్కాటకం:** విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. చాలా కాలంగా వేధిస్తున్న సమస్యల నుండి తెలివిగా బయట పడతారు. అనుకున్న సమయానికి పనులు పూర్తి చేస్తారు. కుటుంబమున శుభకార్య ప్రస్తావన వస్తుంది. వృత్తి ఉద్యోగ విషయంలో అధికారుల సహాయం లభిస్తుంది.

**సింహం:** వృత్తి వ్యాపారాలలో అధిక కష్టంతో స్వల్ప ఫలితాన్ని పొందుతారు. ఉద్యోగమున అదనపు బాధ్యతలు నిర్వహించడం కష్టం అవుతుంది. కుటుంబ సభ్యులతో మాట పట్టింపులు ఉంటాయి. సంతాన పరంగా ఊహించని సమస్యలు కలుగుతాయి. ఉద్యోగస్తులకు పని ఒత్తిడి అధికమవుతుంది.

**కన్య:** ఆర్థిక పరంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ సౌకర్యాలకు లోటు ఉండదు. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. నూతన వాహన లాభం కలుగుతుంది. మిత్రుల సహాయంతో కొన్ని పనులు పూర్తిచేస్తారు. నిరుద్యోగ ప్రయత్నాలు సఫలమౌతాయి. స్థిరాస్తి సంబంధిత క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి.

**తుల:** ముఖ్యమైన ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. చేపట్టిన పనులలో ఆటంకాలు తొలగుతాయి. చిన్ననాటి మిత్రులతో శుభకార్య విషయాలు చర్చిస్తారు. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఉద్యోగ వాతావరణం అనుకూలిస్తుంది.

**వృశ్చికం:** ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. శ్రమాధిక్యతతో కానీ పనులు పూర్తికావు. ఇతరుల వ్యవహారాల్లో జోక్యం చేసుకోకపోవడం మంచిది. భాగస్వామ్య వ్యాపారాలలో విభేదాలు కలుగుతాయి. వృత్తి, ఉద్యోగమున అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. కుటుంబ పెద్దల అనారోగ్య సమస్యలు భాదిస్తాయి.

**ధనస్సు:** చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలలో జాప్యం కలుగుతుంది. ఆకస్మిక ప్రయాణాల వలన శారీరక శ్రమ తప్పదు. జీవిత భాగస్వామితో పుణ్య క్షేత్రాలు సందర్శిస్తారు. ఉద్యోగాలలో ఒడిదుడుకులు అధికమవుతాయి. ఋణదాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది. ఆలయ దర్శనాలు చేసుకుంటారు.

**మకరం:** దూర ప్రాంత బంధు మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. గృహమున శుభకార్యములు నిర్వహిస్తారు. ముఖ్యమైన వ్యవహారాలు నిదానంగా సాగుతాయి. విద్యార్థులు నూతన విద్యావకాశాలు పొందుతారు. వ్యాపారమున ఆటంకాలు తొలగుతాయి. వృత్తి,ఉద్యోగమున కష్టానికి తగిన గుర్తింపు పొందుతారు.

**కుంభం:** చేపట్టిన వ్యవహారాలలో స్వల్ప అవాంతరాలు కలుగుతాయి. ఇంటా బయట ఊహించిన సమస్యలు కలుగుతాయి. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు చోటు చేసుకుంటాయి. బంధుమిత్రులు మీ మాటతో విభేదిస్తారు. వ్యాపార వ్యవహారాలలో స్వల్ప ఆటంకాలు ఉంటాయి. వృత్తి ఉద్యోగాలు మందకొడిగా సాగుతాయి.

**మీనం:** ఆత్మీయుల నుండి కీలక విషయాలు సేకరిస్తారు. పాత మిత్రులతో విహారయాత్రలలో పాల్గొంటారు. చేపట్టిన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. వృత్తి వ్యాపారాలలో నూతన పెట్టుబడులు అందుతాయి. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది.

# చక్కెర చిక్కులు



**మొదటి పేజీ తరువాయి**

చవితి, దసరా, దీపావళి వంటి పండుగలు వరుసగా రావడంతో స్వీట్లు, మిఠాయిలు, బేకరీ ఉత్పత్తులు, శీతల పానీయాలు, ఇతర ఆహార పదార్థాల తయారీలో చక్కెర వినియోగం గణనీయంగా పెరుగుతుంది. ఈ సమయంలో సరఫరా తక్కువగా ఉంటే ధరలపై మరింత ఒత్తిడి తప్పదు. ఇప్పటివరకు ముడి చక్కెర దిగుమతులపై సాధారణంగా 100 శాతం దిగుమతి సుంకం ఉండేది. తాజాగా ప్రభుత్వం ప్రత్యేక సుంక రహిత పరిమితి విధానం కింద 10 లక్షల టన్నుల ముడి చక్కెర దిగుమతికి అనుమతి ఇచ్చింది. అయితే ఇది తెల్ల చక్కెర లేదా శుద్ధి చేసిన చక్కెరకు వర్తించదు. మిల్లులు, అంతర్గత శుద్ధి సామర్థ్యం ఉన్న సంస్థలు ఈ దిగుమతులకు అర్హత పొందనున్నాయి. ఆగస్టు 21 నుంచి 28 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. దిగుమతి చేసుకున్న ముడి చక్కెరను శుద్ధి చేసి దేశీయ మార్కెట్‌లోకి విడుదల చేయడం ద్వారా సరఫరాను పెంచాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

### ఇథనాల్ కారణమా?

చక్కెర సంక్షోభానికి ఇథనాల్ విధానం కూడా కారణమనే వాదనలు ఇటీవల బలంగా వినిపించాయి. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపాలన్న లక్ష్యంతో చెరకు ఆధారిత ఇథనాల్ ఉత్పత్తికి చక్కెర తయారీకి ఉపయోగించే ముడి పదార్థాన్ని మళ్లించడంతో దేశీయ చక్కెర లభ్యత తగ్గిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అయితే ఈ వాదనను కేంద్ర ప్రభుత్వం తాజాగా తోసిపుచ్చింది. 2022-23లో ఇథనాల్ కోసం మళ్లించిన చక్కెర వాటా సుమారు 12 శాతం ఉండగా, 2025-26లో అది దాదాపు 9 శాతానికి తగ్గిందని వినియోగదారుల వ్యవహారాల శాఖ వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో ఉత్పత్తి అవుతున్న ఇథనాల్‌లో దాదాపు మూడొంతులకుపైగా ధాన్యాల నుంచి, ముఖ్యంగా మొక్కజొన్న నుంచి వస్తోందని తెలిపింది. అంటే.. ఇథనాల్ విధానం ఒక్కటే ప్రస్తుత ధరల పెరుగుదలకు కారణమని చెప్పడం సరైనది కాదన్నది కేంద్రం వాదన. కేంద్రం ప్రకారం ప్రస్తుత సంక్షోభానికి అనేక కారణాలు కలిసొచ్చాయి. దేశీయ చక్కెర ఉత్పత్తి అంచనాల కంటే తగ్గడం, చెరకు పంటపై వాతావరణ ప్రభావం, పండుగల కారణంగా డిమాండ్ పెరగడం, అంతర్జాతీయంగా సరఫరా పరిస్థితులు కఠినంగా మారడం, కొంతమంది వ్యాపారులు నిల్వలు దాచుకోవడం, ఊహాగానాల వ్యాపారం వంటి అంశాలు ధరలను పైకి నెట్టాయి. చక్కెర పంటకు నీటి అవసరం అధికంగా ఉండటంతో వర్షపాతం, వాతావరణ పరిస్థితులు ఉత్పత్తిపై నేరుగా ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా మహారాష్ట్ర, కర్ణాటక వంటి కీలక చెరకు ఉత్పత్తి ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి.

### మూడు కోట్ల టన్నుల చక్కెర ఇథనాల్‌కు?

పరిశ్రమ అంచనాల ప్రకారం 2025-26 సీజన్‌లో సుమారు 31 లక్షల టన్నుల చక్కెర సమానమైన ఉత్పత్తి ఇథనాల్ వైపు మళ్లినట్లు ఐసీఆర్ఏ పేర్కొంది. దేశీయ వినియోగం సుమారు 2.83 కోట్ల టన్నులుగా ఉండటంతో సీజన్ ముగిసే నాటికి నిల్వలు గతంతో పోలిస్తే గణనీయంగా తగ్గే అవకాశం ఉందని సంస్థ అంచనా వేసింది. అయితే ఈ సంఖ్యలను ఇథనాల్ విధానంపై ప్రభుత్వ వాదనతో కలిపి చూడాల్సిన అవసరం ఉంది. ఇథనాల్ మళ్లింపు ఒక అంశమే తప్ప, ప్రస్తుత ధరల సంక్షోభానికి అది ఒక్కటే కారణం కాదని కేంద్రం స్పష్టం చేస్తోంది.

ధరల పెరుగుదలను అడ్డుకునేందుకు ప్రభుత్వం ఇప్పటికే వ్యాపారుల నిల్వలపై పరిమితులు విధించింది. ఆగస్టు 1 నుంచి నవంబర్ 30 వరకు చక్కెర వ్యాపారులు ఎంత పరిమాణంలో నిల్వలు ఉంచుకోవచ్చనే దానిపై నియంత్రణలు అమల్లో ఉన్నాయి. నిల్వలను దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించడాన్ని అడ్డుకోవడమే లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది. ఇక నెలకు 10 టన్నులకు మించి చక్కెర వినియోగించే బల్క్ వినియోగదారులకు సెప్టెంబర్ 1 నుంచి నవంబర్ 30 వరకు 15 రోజుల వినియోగానికి మించి నిల్వ ఉంచుకోకుండా కొత్త పరిమితులు విధించారు. స్వీట్ల తయారీదారులు, మిఠాయి సంస్థలు, శీతల పానీయాల తయారీదారులు, ఆహార పరిశ్రమలు వంటి పెద్ద వినియోగదారులు ఈ నిబంధనల పరిధిలోకి వస్తారు. చక్కెర ధర పెరుగుదల ప్రభావం కేవలం వినియోగదారుడి వంటగదికే పరిమితం కాదు. చక్కెరను ముడి పదార్థంగా ఉపయోగించే స్వీట్లు, బేకరీ, పానీయాలు, ఐస్‌క్రీమ్, ఆహార తయారీ పరిశ్రమల ఉత్పత్తి వ్యయాలు కూడా పెరుగుతాయి. చివరకు ఆ భారం వినియోగదారుడిపైనే పడే అవకాశం ఉంటుంది. అదే సమయంలో చక్కెర ధరలు అధికంగా ఉండటం చక్కెర కర్మాగారాలకు, చెరకు రైతులకు కొంత ఉపశమనం కలిగించవచ్చు. కానీ దిగుమతులు పెద్దఎత్తున జరిగితే దేశీయ మార్కెట్‌లో ధరలు తగ్గి పరిశ్రమ ఆదాయంపై ఒత్తిడి రావచ్చన్న ఆందోళన కూడా ఉంది. దిగుమతుల ప్రకటన తర్వాత కొన్ని చక్కెర కంపెనీల షేర్లు 5 శాతం వరకు పడిపోవడం మార్కెట్ ఆందోళనకు సంకేతంగా నిలిచింది.

# ఎకరం రూ.264 కోట్లు

**మొదటి పేజీ తరువాయి**

హోటల్‌కు ఎదురుగా, దుర్గం చెరువు, హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు అత్యంత సమీపంలో ఈ ప్లాట్ ఉంది. మల్టీ-యూజ్ జోన్‌గా ఉన్న ఈ భూమి కోసం పలు ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు తీవ్రంగా పోటీపడ్డాయి. ఈ వేలంలో పాల్గొనేందుకు బిడ్డర్లు రూ. 10 కోట్ల డిపాజిట్ చెల్లించారు. ఈ భూముల వేలంపై తెలంగాణ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఇక్కడ చారిత్రక రాతి కట్టడాలు ఉన్నాయని, దుర్గం చెరువుకు సమీపంలో ఉన్నాయని, యాజమాన్య హక్కుల వివాదాలు ఉన్నాయని పిటిషనర్లు ఆరోపించారు. అయితే, వేలం ప్రక్రియను నిలిపివేసేందుకు న్యాయస్థానాలు నిరాకరించాయి. ఈ ప్లాట్లు రక్షిత వారసత్వ ప్రాంతాలు, బఫర్ జోన్ల పరిధిలోకి రావని ప్రభుత్వం స్పష్టం చేసింది. గత కొన్నేళ్లుగా రాయదుర్గం ప్రాంతంలో భూముల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. 2025లో ఇక్కడ ఎకరా ధర రూ. 177 కోట్లుగా ఉండేది. ఇప్పుడు అంతకుమించి రికార్డు ధర పలికింది. తాజా డిమాండ్ నేపథ్యంలో, ఇదే సర్వే నంబరులో మరో 5.38 ఎకరాల ప్లాట్‌కు ఆగస్టు 28న వేలం నిర్వహించనున్నట్లు టీజీఐఐసీ ప్రకటించింది. రాయదుర్గం పాన్ మక్తా భూముల వేలం ప్రక్రియలో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ వేలాన్ని నిలిపివేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఏవైనా అభ్యంతరాలు ఉంటే హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) రాయదుర్గం పాన్ మక్తాలోని సుమారు 11 ఎకరాల భూమిని వేలం వేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎకరాకు కనీస ధరను రూ. 175 కోట్లుగా నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ జువ్వాడి ప్రణయ సింహారావు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ వాదనలు వినిపిస్తూ, గతంలో కంచ గచ్చిబౌలిలోని భూముల వేలాన్ని సుప్రీంకోర్టు నిలిపివేసిందని, ప్రస్తుతం ప్రభుత్వం అవే రక్షిత భూములను వేలం వేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అయితే, తెలంగాణ ప్రభుత్వం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ ఈ ఆరోపణలను తోసిపుచ్చారు. పిటిషనర్ కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన వాదించారు. ప్రస్తుతం వేలానికి ఉంచిన రాయదుర్గం భూములకు, గతంలో స్టే ఇచ్చిన కంచ గచ్చిబౌలి భూములకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ రెండు ప్రాంతాల మధ్య దాదాపు 5 కిలోమీటర్ల దూరం ఉందన్న విషయాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.

# ‘అంతరిక్ష’ అడ్డా భారత్

**మొదటి పేజీ తరువాయి**

సీఈఓలు, వ్యవస్థాపకులతో నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. ఈ మేరకు భారత అంతరిక్ష రంగం గురించి మోదీ వ్యాఖ్యానించారు. యువ అంతరిక్ష పారిశ్రామికవేత్తలకు తమ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. వ్యవసాయం, పశు సంపద నిర్వహణ, పాడి, పర్యావరణం, ప్రజల దైనందిన జీవితాలను ప్రభావితం చేసే ఇతర రంగాలలో అంతరిక్ష సాంకేతికతను ఎలా ఉపయోగించవచ్చో అన్వేషించాలని స్పేస్ స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులను కోరారు. స్పేస్ స్టార్టప్‌ల వంటి కొత్త, సవాల్‌తో కూడిన రంగంలోకి ప్రవేశించి రిస్కులు తీసుకున్నందుకు వారిని ప్రశంసించారు. సాంకేతిక పరిజ్ఞానాల వినియోగాన్ని విస్తరించడానికి అంతరిక్ష సంస్థలు, ఇతర రంగాల సంస్థల మధ్య మరింత సహకారం ఉండాలని పిలుపునిచ్చారు. భారత అంతరిక్ష రంగ యువ కెరటాలను కలవడం అద్భుతంగా ఉందన్నారు మోదీ. “ఒక కొత్త, సవాల్‌తో కూడిన రంగంలోకి ప్రవేశించి అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించిన యువ పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు వీరు. వారు రిస్కులు తీసుకున్నారు, సంస్కరణల ప్రక్రియను విశ్వసించారు. తమ ప్రయత్నాలలో నిలకడగా ఉన్నారు. దీని కారణంగా గత కొన్నేళ్లుగా అంతరిక్ష రంగంలో భారత్ ఎంతో సాధించింది.

## రేవంత్ వచ్చాక మాట్లాడతా

**మొదటి పేజీ తరువాయి**

చేసిన విమర్శలపై పార్టీ నాయకత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ క్రమంలోనే క్రమశిక్షణ కమిటీ కొండా సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనిపై సురేఖ ఇప్పటికే కమిటీకి లిఖితపూర్వక వివరణ ఇచ్చారు. తన కుమార్తె వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతమని, వాటికి తనను బాధ్యురాలిని చేయవద్దని ఆమె ఆ లేఖలో కోరారు. అయితే, ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ అధిష్ఠానం కూడా అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ అంతర్గత వర్గాల్లో ఈ అంశంపై విస్తృత చర్చ జరుగుతోంది. కేవలం నోటీసులతోనే సరిపెట్టకుండా, క్రమశిక్షణా చర్యలు మరింత కఠినంగా ఉండే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిరిగి వచ్చిన తర్వాత ఈ వివాదంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## ఇందిరమ్మ ఇళ్ల ‘క్యూర్’ అర్హత జాబితా విడుదల

**మొదటి పేజీ తరువాయి**

ప్రభుత్వం వద్దకు 60,720 దరఖాస్తులు అందాయి. దరఖాస్తుదారుల ఆస్తులు, వాహనాలు, సొంత ఇల్లు వంటి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు, ప్రాథమికంగా సుమారు 40,000 మందిని అర్హులుగా గుర్తించారు. దరఖాస్తుదారులు తమ స్టేటస్‌ను ఆన్‌లైన్‌లో సులభంగా తెలుసుకోవచ్చు. దరఖాస్తుదారులు తమ స్టేటస్‌ను చెక్ చేసుకునేందుకు సంబంధిత వెబ్‌సైట్‌ను సందర్శించాలి. అక్కడ అప్లికేషన్ నంబర్, మొబైల్ నంబర్ లేదా ఆధార్ నంబర్ ఆప్షన్‌ను ఎంచుకుని, సంబంధిత వివరాలు ఎంటర్ చేసి సెర్చ్ చేయాలి. దీంతో మీ అప్లికేషన్ నంబర్, పేరు, ప్రాజెక్ట్ లొకాలిటీ, స్టేటస్ వంటి వివరాలు కనిపిస్తాయి. ఒకవేళ మీ స్టేటస్ ‘అనర్హులు’ అని చూపిస్తే, దాని పక్కనే ఉన్న ‘రెయిజ్ క్లెయిమ్’ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఎందుకు అనర్హులుగా ప్రకటించారో కారణం అక్కడ కనిపిస్తుంది.

# సురేఖకు ఉద్వాసన!?

**మొదటి పేజీ తరువాయి**

తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీపై బహిరంగంగా విమర్శలు చేయడం క్రమశిక్షణా రాహిత్యమేనని వారు అభిప్రాయపడ్డారు. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని మంత్రి కొండా సురేఖ చెప్పడం సరికాదని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. సొంత కుమార్తె ముఖ్యమంత్రిపై తీవ్ర వ్యాఖ్యలు చేసినప్పుడు తల్లి వాటిని బహిరంగంగా ఖండించాలని డిమాండ్ చేశారు. పార్టీలో ఏవైనా అభిప్రాయ భేదాలు ఉంటే సీఎల్పీ, పీసీసీ, పార్టీ అంతర్గత సమావేశాల్లో చర్చించుకోవాలని సూచించారు. బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉన్న వ్యక్తులు పార్టీకి, ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించేలా బహిరంగ వ్యాఖ్యలు చేయడం సరికాదని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై ఎవరైనా తప్పుడు ఆరోపణలు చేస్తే కాంగ్రెస్ అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీలో ఉంటూ ముఖ్యమంత్రి నిర్ణయాలను బహిరంగంగా వ్యతిరేకించడం సరికాదని ప్రభుత్వ విప్ వేముల వీరేశం తెలిపారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడానికి సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ నాయకులు ఎంతో కష్టపడ్డారని పేర్కొన్నారు. సీఎం, పార్టీపై విమర్శలు చేయడం ద్వారా సొంత పార్టీకి నష్టం కలిగించినట్లవుతుందని వ్యాఖ్యానించారు. ‘చెట్టు మీద ఉండి అదే చెట్టు కొమ్మను నరుక్కోవడం’ లాంటి వైఖరి సరికాదని వేముల వీరేశం తీవ్రంగా వ్యాఖ్యానించారు. కొండా సురేఖ గతంలోనూ తన వ్యాఖ్యలతో పార్టీకి ఇబ్బందులు తెచ్చారని ఆరోపించారు. కొండా సుస్మిత వ్యాఖ్యలను ఖండించి, సీఎం రేవంత్‌రెడ్డికి కొండా సురేఖ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వివాదం మరింత ముదరడంతో కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలని పలువురు కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. అంతేకాకుండా పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినందుకు పార్టీ నుంచి కూడా తొలగించాలని కోరారు. పార్టీకి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే వారిని కేబినెట్‌లో కొనసాగించవద్దని సీఎల్పీ వేదికగా నేతలు స్పష్టం చేశారు. కొండా సుస్మిత వ్యాఖ్యలను మంత్రి సురేఖ ఇప్పటివరకు ఖండించకపోవడాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల అయిలయ్య తప్పుబట్టారు. పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే అంతర్గతంగా చర్చించుకోవాలని.. ముఖ్యమంత్రిపై బహిరంగంగా విమర్శలు చేయడం సరికాదని తేల్చి చెప్పారు.

# చినుకమ్మ అలకలు

**మొదటి పేజీ తరువాయి**

మరోసారి వర్షం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పంటకు అవసరమైన సమయంలో నీరు అందకపోతే పెట్టుబడి మొత్తం వృథా అవుతుందన్న భయం వెంటాడుతోంది. వర్షాభావానికి తోడు పగటి ఉష్ణోగ్రతలు పెరగడం పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మారుస్తోంది. సాధారణంగా వర్షాకాలంలో ఉండాల్సిన మేఘావృత వాతావరణం లేకపోవడంతో ఎండ తీవ్రత పెరుగుతోంది. భూమిలో ఉన్న తేమ త్వరగా ఆవిరైపోవడంతో మొక్కలు నీటి ఒత్తిడికి గురవుతున్నాయి. చిన్న వయసులో ఉన్న పంటలకు ఈ పరిస్థితి మరింత ప్రమాదకరం. మొక్కలు ఎదుగుదల మందగించడం, ఆకులు వాడిపోవడం, పూత దశలో ఉన్న పంటల్లో దిగుబడి తగ్గే అవకాశం ఉండటం రైతులను కలవరపెడుతోంది. రైతు వ్యవసాయాన్ని ప్రారంభించిన రోజే ఖర్చులు మొదలవుతాయి. విత్తనాలు కొనాలి. పొలం దున్నాలి. ఎరువులు వేయాలి. కూలీలను పెట్టుకోవాలి. పురుగుమందులు కొనాలి. ఇవన్నీ అప్పు చేసి చేసిన రైతుకు పంట చేతికొచ్చే వరకు ప్రతి రోజూ ఒక పరీక్షే. ఇప్పుడు వర్షాలు కురవకపోవడంతో ఆ పెట్టుబడి మొత్తం ప్రమాదంలో పడింది. పంట ఎండిపోతే నష్టం రైతుదే. రుణం మాత్రం మిగిలిపోతుంది. అందుకే వర్షాభావం కేవలం ప్రకృతి సమస్య కాదు.. అది రైతు కుటుంబ ఆర్థిక భద్రతకు సంబంధించిన సమస్యగా మారుతోంది.

### భూగర్భజలాలపై ఒత్తిడి

వర్షాలు లేకపోవడంతో బోర్లు, బావులపై ఆధారపడే రైతుల సంఖ్య పెరుగుతోంది. అయితే భూగర్భజలాలు కూడా అన్ని ప్రాంతాల్లో అందుబాటులో లేకపోవడం మరో సమస్య. ఇప్పటికే నీటి మట్టాలు తగ్గిన ప్రాంతాల్లో మోటార్లు నడిపినా నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కరెంటు కోసం ఎదురుచూడాలి.. బోరు నుంచి నీరు వస్తుందో లేదో చూడాలి.. వచ్చిన నీటిని పొలానికి చేర్చాలి. ఇలా ప్రతి దశలోనూ రైతుకు అనిశ్చితి తప్పడం లేదు. వర్షాల కొరత కొనసాగితే పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, కంది, పెసర, వరి తదితర పంటలపై ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లో పంటల సాగు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉంది. వర్షాలు ఆలస్యంగా వచ్చినా సరైన సమయంలో సమృద్ధిగా కురిస్తే కొంతమేర పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుంది.

# నా టార్గెట్ రేవంత్

**మొదటి పేజీ తరువాయి**

స్పందించాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. ఆ మీడియా సమావేశంలో పాల్గొన్న వారిలో అనేకులు పార్టీలు మారిన వారేననే విషయాన్ని వారు గుర్తుంచుకుంటే మంచిదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానంపై తమకు నమ్మకం ఉన్నదని, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ, మల్లికార్జున ఖర్గే అంటే గౌరవం ఉన్నదని చెప్పారు. శుక్రవారం ఆమె జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు. ఎన్నికల్లో అభ్యర్థులను ప్రకటించేది పార్టీయే కానీ, సీఎం కాదని చెప్పారు. తన తండ్రి కొండా మురళీధర్‌రావుకు ఎమ్మెల్సీ ఇస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి ఎందుకు మాట తప్పారని తాను అడుగకూడదా? అని సుస్మిత ప్రశ్నించారు. తన తండ్రి ఎమ్మెల్సీగా రెండుసార్లు ఏకగ్రీవంగా గెలిచిన వ్యక్తి అని స్పష్టం చేశారు.

## రేవంత్.. దా ఇగ!

విదేశాంగ శాఖ నుంచి అనూహ్య పరిణామం ఎదురైంది. యూకేలో జరిగే సమావేశాలకు మాత్రమే అనుమతి లభించింది. అమెరికాలో నిర్వహించాల్సిన సమావేశాలకు గ్రీన్‌సిగ్నల్ రాలేదు. దీంతో సీఎం తన పర్యటనను కుదించుకుని హైదరాబాద్‌కు తిరిగి రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

### పర్యటన కార్యక్రమం హోదాకు, ఉద్దేశానికి తగినట్లు లేదు: కేంద్రం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదిత అమెరికా పర్యటనకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) శుక్రవారం స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి హోదాకు, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా కార్యక్రమం లేదని భావించడంతో అమెరికా పర్యటనకు రాజకీయ అనుమతి నిరాకరించినట్లు ఎంఈఏ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖుల విదేశీ పర్యటనలకు రాజకీయ అనుమతి ఇచ్చే ముందు వారి కార్యక్రమాలను మంత్రిత్వ శాఖ పరిశీలిస్తుందని జైస్వాల్ చెప్పారు.

## 1600 మెడికల్ సీట్లు గాయబ్!

**మొదటి పేజీ తరువాయి**

విద్యార్థులను స్థానికులుగా పరిగణించేలా జీవో 150లో నిబంధనలు తీసుకురావడం వల్ల రాష్ట్ర విద్యార్థులకు నష్టం జరుగుతుందని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న ప్రధాన ఉద్దేశాల్లో భవిష్యత్ తరాలకు న్యాయం చేయడం కూడా ఒకటని ఆమె గుర్తుచేశారు. తెలంగాణలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో స్థానిక విద్యార్థులకు ఎక్కువ ప్రయోజనం కలిగేలా నిబంధనలు ఉండాలని ఆమె అభిప్రాయపడ్డారు. జీవో 150 అమలుతో మెడిసిన్‌లో సుమారు 1,600 సీట్లు తెలంగాణ విద్యార్థులకు కాకుండా ఇతర రాష్ట్రాల విద్యార్థులకు వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందని కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లో ఇతర ప్రాంతాల విద్యార్థులకు ఎక్కువ అవకాశాలు కల్పించడం సరికాదని పేర్కొన్నారు.

# మీ స్కిల్స్‌కు శక్తినిస్తాం



## పాలిటెక్నిక్ విద్యార్థులకు భంగం కలగదు.. మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టీకరణ.. సందేహాలను నివృత్తి చేసిన మంత్రి

హైదరాబాద్, ఆగస్టు 21 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థుల వద్దకు మంత్రి వివేక్ వెంకటస్వామి వెళ్లి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పాలిటెక్నిక్‌లను శక్తి శాఖ పరిధిలోకి తీసుకురావడంపై విద్యార్థుల్లో నెలకొన్న సందేహాలు, అపోహలు, ఆందోళనలను మంత్రి ఓపికగా విని.. ఒక్కొక్క అంశంపై స్పష్టత ఇచ్చారు. విద్యార్థుల విద్య, ఫీజులు, పరీక్షలు, డిప్లొమా గుర్తింపు, ఈసెట్, లేటరల్ ఎంట్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్టైఫండ్ వంటి అంశాలపై వారి ప్రశ్నలకు సమాధానమిస్తూ.. ఇప్పటికే చదువుతున్న విద్యార్థుల ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగదని భరోసా ఇచ్చారు. అలాగే పాలిటెక్నిక్‌లలో మౌలిక వసతుల అభివృద్ధి, ఆధునిక సాంకేతిక విద్య, పరిశ్రమలతో అనుసంధానం, మెరుగైన ఉద్యోగ అవకాశాల కల్పన కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి -- విద్యార్థుల మధ్య జరిగిన సంభాషణ ఇలా సాగింది.

### పాలిటెక్నిక్ విద్యార్థులు - మంత్రి వివేక్ వెంకటస్వామి మధ్య సంభాషణ

**విద్యార్థుల ప్రశ్న: పాలిటెక్నిక్‌లను 'శక్తి' శాఖలోకి మార్చడం వల్ల మా చదువులు, సర్టిఫికెట్లు, పరీక్షల్లో ఏమైనా మార్పులు వస్తాయా?**

మంత్రి వివేక్ వెంకటస్వామి: ఎలాంటి మార్పులు ఉండవు. మీరు ప్రస్తుతం ఏ విధంగా చదువుతున్నారో అదే విధంగా కొనసాగుతుంది. ఏఐసీటీఈ గుర్తింపు, పరీక్షలు, డిప్లొమా సర్టిఫికెట్ అన్నీ కొనసాగుతాయి. మీకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

**విద్యార్థుల ప్రశ్న: మా ఫీజులు పెరుగుతాయా?**

మంత్రి: ఫీజు విషయంలో ఎలాంటి మార్పు ఉండదు. ప్రస్తుతం ఉన్న ఫీజు నిర్మాణమే కొనసాగుతుంది. అంతేకాదు, విద్యార్థులకు స్టైఫండ్ అందించే అంశాన్ని కూడా ప్రభుత్వం ఆలోచిస్తోంది. మీపై అదనపు ఆర్థిక భారం పడకుండా చూస్తాం.

**ప్రశ్న: ఈసెట్ పరీక్ష ఉంటుందా? మేము బీటెక్‌లోకి లేటరల్ ఎంట్రీ ద్వారా వెళ్లగలమా?**

మంత్రి: ఖచ్చితంగా ఈసెట్ పరీక్ష ఉంటుంది. ఇప్పటివరకు ఉన్న విధానమే కొనసాగుతుంది. ఈసెట్ ద్వారా బీటెక్‌లో రెండో సంవత్సరంలో లేటరల్ ఎంట్రీ పొందే అవకాశం కూడా కొనసాగుతుంది. దీనిపై ఎలాంటి ఆందోళన అవసరం లేదు. అవసరమైతే దీనిపై స్పష్టత ఇస్తూ ప్రత్యేక జీవో కూడా తీసుకొస్తాం.

**ప్రశ్న: మేము డిప్లొమా పూర్తి చేసిన తర్వాత మా సర్టిఫికెట్‌కు విలువ తగ్గుతుందా?**

మంత్రి: అసలు తగ్గదు. ప్రస్తుతం మీ డిప్లొమాకు ఉన్న గుర్తింపు, విలువ పూర్తిగా కొనసాగుతుంది. భవిష్యత్తులో ఆ విలువను మరింత పెంచాలన్నదే మా ప్రభుత్వ ఉద్దేశం. స్కిల్ యూనివర్సిటీని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లి మీకు



మరిన్ని అవకాశాలు కల్పించాలనుకుంటున్నాం.

**ప్రశ్న: పాలిటెక్నిక్‌లను ప్రైవేటీకరణ చేస్తారని మాకు భయం ఉంది. నిజంగా ప్రైవేటీకరణ జరుగుతుందా?**

మంత్రి: ప్రైవేటీకరణ అనే ప్రశ్నే లేదు. పాలిటెక్నిక్‌లు ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయి. గవర్నమెంట్ కంట్రోల్‌లోనే విద్య, పరీక్షలు, ఫీజులు, విద్యార్థుల ప్రయోజనాలు కొనసాగుతాయి. పరిశ్రమలను భాగస్వామ్యం చేయాలనుకుంటున్నది ఉద్యోగ అవకాశాలు, సాంకేతిక శిక్షణ, సీఎస్ఆర్ నిధులు తీసుకురావడం కోసం మాత్రమే.

**ప్రశ్న: పరిశ్రమలను భాగస్వామ్యం చేస్తే భవిష్యత్తులో ప్రైవేట్ సంస్థల నియంత్రణకు వెళ్లే అవకాశం ఉండదా?**

మంత్రి: ఉండదు. ప్రభుత్వం బాధ్యత వహిస్తుంది. పరిశ్రమల నుంచి సీఎస్ఆర్ నిధులు, సాంకేతిక సహకారం తీసుకుని పాలిటెక్నిక్‌లను అభివృద్ధి చేస్తాం. మీ విద్యకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహిస్తుంది.

**ప్రశ్న: మా ఫీజు రీయింబర్స్‌మెంట్ పరిస్థితి ఏమవుతుంది?**

మంత్రి: ప్రస్తుతం మీకు ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానం కొనసాగుతుంది. పాలిటెక్నిక్‌లు ఒక ప్రభుత్వ శాఖ నుంచి మరో ప్రభుత్వ శాఖ పరిధిలోకి వెళ్లడం వల్ల విద్యార్థులకు ఉన్న ప్రయోజనాలు తొలగిపోవు.

**ప్రశ్న: ఇప్పటికే పాలిటెక్నిక్‌లో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి ఏమవుతుంది?**

మంత్రి: ఇప్పటికే అడ్మిట్ అయిన విద్యార్థుల విషయంలో ఎలాంటి మార్పులు ఉండవు. మీరు ఏ కోర్సులో చేరారో అదే కోర్సును పూర్తి చేస్తారు. మీ పరీక్షలు, సిలబస్, సర్టిఫికెట్లు, ఫీజులు అన్నీ కొనసాగుతాయి.

**ప్రశ్న: మా సిలబస్‌లో మార్పులు చేస్తారా?**

మంత్రి: ప్రస్తుతం ఉన్న కోర్సులు కొనసాగుతాయి. అయితే భవిష్యత్తులో కొత్త పరిశ్రమలు, కొత్త టెక్నాలజీలకు అనుగుణంగా కొత్త కోర్సులు తీసుకురావచ్చు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆ కొత్త కోర్సులను ఎంచుకోవచ్చు. ఇప్పటికే ఉన్న కోర్సులను తొలగించి మీపై బలవంతంగా కొత్త కోర్సులు రుద్దే పరిస్థితి ఉండదు.

**ప్రశ్న: మా ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతాయా?**

మంత్రి: తగ్గవు.. పెరుగుతాయి. ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ మారుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల కొన్ని రంగాల్లో ఉద్యోగాల స్వభావం మారుతోంది. అందుకే కొత్త టెక్నాలజీలపై శిక్షణ ఇచ్చి, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను మీకు అందించాలనుకుంటున్నాం. దాని వల్ల మీకు దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి.

**ప్రశ్న: పాలిటెక్నిక్‌ల అభివృద్ధికి ప్రభుత్వం ఎంత నిధులు ఖర్చు చేయబోతోంది?**

మంత్రి: పాలిటెక్నిక్‌లను ఆధునీకరించేందుకు సుమారు రూ.600 నుంచి రూ.800 కోట్ల వరకు నిధులు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త పరికరాలు, సౌకర్యాలు, ఆధునిక సాంకేతిక శిక్షణ అందించేలా పాలిటెక్నిక్‌లను అభివృద్ధి చేస్తాం.

**ప్రశ్న: ఆ నిధులు ఎందుకు శక్తి శాఖ నుంచి రావాలి?**

మంత్రి: పాలిటెక్నిక్‌ల అభివృద్ధికి నిధులు అవసరం. శక్తి శాఖ పరిధిలోకి వచ్చిన తర్వాత ఆ శాఖ ద్వారా నిధులు సమకూర్చి పాలిటెక్నిక్‌లను అభివృద్ధి చేయాలన్నది మా ఆలోచన. శాఖ మారినంత మాత్రాన మీ విద్యలో మార్పు ఉండదు. పైగా మీకు అదనపు నిధులు, మెరుగైన సౌకర్యాలు అందే అవకాశం ఉంటుంది.

**ప్రశ్న: మాకు స్టైపెండ్ వస్తుందని చెబుతున్నారు. ఎంత వస్తుంది?**

మంత్రి: విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా స్టైపెండ్ అందించాలన్నది ప్రభుత్వ ఆలోచన. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కూడా విద్యార్థులకు రూ.2,000 స్టైఫండ్ అందించే అంశాన్ని ప్రకటించారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు కూడా ఈ ప్రయోజనం కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది.

**ప్రశ్న: భవిష్యత్తులో వచ్చే ప్రభుత్వం ఈ నిర్ణయాలను మార్చేస్తే మా పరిస్థితి ఏంటి?**

మంత్రి: ప్రస్తుతం ఉన్న ప్రభుత్వంగా మేము మీ ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఉన్న జీవోలు కొనసాగుతాయని అధికారులు కూడా స్పష్టం చేశారు. మీకు ఉన్న హక్కులు, భద్రత ఎక్కడా దెబ్బతినకుండా చూస్తాం.

**ప్రశ్న: మాటలతో కాకుండా జీవో ద్వారా హామీ ఇవ్వగలరా?**

మంత్రి: తప్పకుండా. మీకు ఏ అంశంపై స్పష్టత కావాలో చెప్పండి. అవసరమైన చోట జీవోలోనే స్పష్టమైన నిబంధనలు పొందుపరుస్తాం. మీ సమస్యలను పరిష్కరించే బాధ్యత ప్రభుత్వానిది. మీకు అనుమానం ఉంటే నన్ను నేరుగా సంప్రదించండి.

**ప్రశ్న: మాకు ఇంతకుముందు ఈ విషయాలపై స్పష్టత లేకపోవడం వల్లే ఆందోళన చెందుతున్నాం.**

మంత్రి: మీ ఆందోళన నాకు అర్థమవుతోంది. కొత్తగా శాఖ మారుతుందని తెలిసినప్పుడు సందేహాలు రావడం సహజం. అందుకే నేను స్వయంగా మీ ముందుకు వచ్చి మాట్లాడుతున్నాను. మీ సమస్యలు ఏమైనా ఉంటే ఒక్కొక్కటిగా చెప్పండి. చర్చిద్దాం.. పరిష్కరిద్దాం.

**ప్రశ్న: చివరగా పాలిటెక్నిక్ విద్యార్థులకు మీరు ఏం చెప్పాలనుకుంటున్నారు?**

మంత్రి: మీ భవిష్యత్తు బాగుండాలన్నదే మా ప్రభుత్వ ఉద్దేశం. మీకు ఎక్కడా నష్టం జరగదు. ఫీజులు, పరీక్షలు, డిప్లొమా గుర్తింపు, లేటరల్ ఎంట్రీ, సిలబస్, ఇప్పటికే ఉన్న విద్యార్థుల ప్రయోజనాలు.. ఏ విషయంలోనూ మీకు ఇబ్బంది కలిగేలా నిర్ణయం తీసుకోం. పైగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమల సహకారం, కొత్త కోర్సులు, మెరుగైన మౌలిక సదుపాయాలతో మీకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నదే మా లక్ష్యం.

**ప్రశ్న: అంటే మా భవిష్యత్తు గురించి భయపడాల్సిన అవసరం లేదంటారా?**

మంత్రి: అసలు భయపడాల్సిన అవసరం లేదు. మీ భవిష్యత్తుకు ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుంది. మీకు ఏమైనా సందేహం ఉంటే నేరుగా అడగండి. నేను మంత్రిగా మీ ప్రతి సమస్యను విని, అవసరమైన చోట పరిష్కారం చూపించేందుకు సిద్ధంగా ఉన్నాను.

**ఫ్యాకల్టీ ప్రశ్న: మా స్టాఫ్ జీతాలు, సర్వీస్ కండిషన్స్‌లో మార్పులు వస్తాయా?**

మంత్రి: ఎలాంటి మార్పులు ఉండవు. జీతాలు, ప్రమోషన్లు, సర్వీస్ కండిషన్స్ అన్నీ కొనసాగుతాయి. మీరు ప్రభుత్వ ఉద్యోగులుగానే ఉంటారు. భవిష్యత్తులో అభివృద్ధి పెరిగితే మరిన్ని పోస్టులు, మరిన్ని ప్రమోషన్ అవకాశాలు ఎలా కల్పించాలనే దానిపై కూడా ఆలోచిస్తాం.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

## తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ ఏర్పాటు

హైదరాబాద్, ఆగస్టు 21 (ఈవార్తలు): తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్‌ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఫార్మసీ చట్టం 1948, సెక్షన్ 19 నిబంధనల ప్రకారం కౌన్సిల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్. చోంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2003లో రిజిస్టర్డ్ ఫార్మసిస్టుల ద్వారా ఎన్నికైన సభ్యులతో పాటు ప్రభుత్వం నామినేట్ చేసిన సభ్యులకు ఈ కౌన్సిల్‌లో స్థానం కల్పించారు. గతంలో రిటర్నింగ్ అధికారి విడుదల చేసిన ఎన్నికల ఫలితాల గెజిట్ నోటిఫికేషన్ ఆధారంగా ఎం. వినోద్ కుమార్, సిహెచ్. పరమాత్మ, బిర్కూర్ సుధాకర్, టి. రాజు, ఎన్. ప్రమోద్, వి. నాగ సాయి శ్రీకేష్‌లను సభ్యులుగా నోటిఫై చేశారు. మరోవైపు ప్రభుత్వం ఫార్మసీ చట్టం నిబంధనల ప్రకారం ప్రభుత్వం ఐదుగురు సభ్యులను నామినేట్ చేసింది. ఇందులో అర్గొండ శ్రీధర్, ఎదురె రమేష్, ప్రసన్నలక్ష్మి మచ్చా, శివకుమార్ తేజావత్, చిల్లువేరి మారుతి ఉన్నారు. వీరితో పాటు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ నుంచి నామినేట్ అయిన డాక్టర్ గుండగాని శ్రీనివాస్ సభ్యుడిగా, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ), డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్, డీసీఏ సీనియర్ అనలిస్టులు ఎక్స్-అఫీషియో సభ్యులుగా ఉంటారు. కౌన్సిల్ పూర్తి స్థాయి సభ్యుల జాబితా ఖరారు కావడంతో ఈ నెల 31 కౌన్సిల్ తొలి సమావేశం ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఫార్మసీ చట్టం సెక్షన్ 23 ప్రకారం.. ఈ సమావేశంలో ఎన్నికైన, నామినేట్ అయిన సభ్యులందరూ కలిసి తమలో ఒకరిని చైర్మన్ గా, మరొకరిని వైస్ చైర్మన్ గా ఎన్నుకోనున్నారు.

## మర్రి జనార్దన్ రెడ్డిపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్, ఆగస్టు 21 (ఈవార్తలు): బీఆర్ఎస్ నేత, నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా రాస్తారోకో నిర్వహించి, విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలపై ఈ చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే... నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుపై మర్రి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిన్న ధర్నా, రాస్తారోకో చేపట్టారు. సుమారు గంటపాటు రహదారిని దిగ్బంధించడంతో సాధారణ ప్రజలకు, రవాణా వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అనంతరం వీరు అనుమతి లేకుండా ఆర్డీఓ కార్యాలయంలోకి ప్రవేశించి నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించారంటూ కానిస్టేబుల్ పాత్లావత్ దేవేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం నాగర్‌కర్నూల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డితో పాటు మరో 38 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

## 24న ఆటో కార్మికుల రాష్ట్రవ్యాప్త బంద్



హైదరాబాద్, ఆగస్టు 21 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ నెల 24న చేపట్టబోయే ఆటో కార్మికుల రాష్ట్ర వ్యాప్త బంద్ పోస్టర్‌ను బీఆర్‌టీయూ నాయకులు, ఆటో డ్రైవర్లతో కలిసి సూర్యాపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఆర్టీసీ యాజమాన్యానికి ఈ-ఆటోలను కేటాయించే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని, ఆటో కార్మికుల రక్షణకు ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ఇంధన ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ ఛార్జీలను పెంచడంతో పాటు ఓలా, ఉబర్, రాపిడోలకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వమే సొంతంగా యాప్‌ను ప్రారంభించాలని సూచించారు. బైక్ టాక్సీల అక్రమ రవాణాను అరికట్టాలని, ఆటో కార్మికులకు ఏడాదికి రూ. 12 వేల ఆర్థిక సాయం అందించడంతో పాటు వారిని ఈ-చలాన్ల నుంచి మినహాయించాలని కోరారు. హైదరాబాద్‌లో ఇతర జిల్లాల ఆటోల అక్రమ రవాణాను అరికట్టాలని, వాహన సారథి లైసెన్స్ విధానాన్ని కొనసాగిస్తూ జీవో 60 ప్రకారం రేడియం స్టిక్కరింగ్ నుంచి ఆటోలకు మినహాయింపు ఇవ్వాలని పేర్కొన్నారు. ఆటో కార్మికులకు ప్రమాద బీమాతో పాటు సాధారణ మరణాలకు కూడా బీమా వర్తింపజేయాలని, 50 ఏళ్లు దాటిన వారికి పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న ఆటో కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ ఈ నెల 24న నిర్వహించే బంద్‌కు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

## రాజకీయ ఒత్తిళ్లు కాదు!

ఏపీ ఎంపీ కుమారుడి అరెస్టుపై హైదరాబాద్ పోలీసుల వివరణ

హైదరాబాద్, ఆగస్టు 21 (ఈవార్తలు): మాదాపూర్‌లో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదం కేసులో జనసేన ఎంపీ లింగమనేని రమేశ్ కుమారుడు లింగమనేని సంజూష్ (21)ను ఇంకా అరెస్టు చేయకపోవడంపై సైబరాబాద్ పోలీసులు వివరణ ఇచ్చారు. తాము నిబంధనల ప్రకారమే వ్యవహరించామని, ఈ విషయంలో ఎవరి పలుకుబడికి లొంగలేదని వారు స్పష్టం చేశారు. ఆగస్టు 16న మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ సమీపంలో రోడ్డు దాటుతున్న భారతి ముఖి (26) అనే యువతిని సంజూష్ నడుపుతున్న ఆస్టన్ మార్టిన్ కారు అతివేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతురాలు భారతి ఒక లైఫ్‌స్టైల్ స్టోర్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. ఈ ఘటనపై మాదాపూర్ పోలీసులు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 106(1) (నిర్లక్ష్యం కారణంగా మరణం సంభవించడం) కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో గరిష్ఠ శిక్ష ఐదేళ్లు మాత్రమేనని, ఏడేళ్లలోపు శిక్ష పడే నేరాల్లో నిందితులను వెంటనే అరెస్ట్ చేయాల్సిన అవసరం లేదని సైబరాబాద్ డీసీపీ రితిరాజ్ తెలిపారు. సుప్రీంకోర్టు "అర్నేష్ కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బీహార్" కేసులో ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 35 కింద నిందితుడికి నోటీసులు జారీ చేసినట్లు వివరించారు. దర్యాప్తునకు సహకరించాలని ఆ నోటీసులో పేర్కొన్నట్లు వెల్లడించారు. ప్రమాదం జరిగిన వెంటనే సంజూష్‌ను అదుపులోకి తీసుకుని ఆల్కహాల్, డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా ఫలితాలు నెగటివ్‌గా వచ్చాయని, తదుపరి నిర్ధారణ కోసం రక్త నమూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు పోలీసులు పేర్కొన్నారు. నిందితుడి రాజకీయ నేపథ్యం కారణంగానే పోలీసులు అరెస్ట్ చేయలేదని వస్తున్న ఆరోపణలను పోలీసులు ఖండించారు. అవి కేవలం నిరాధారమైన ఆరోపణలని కొట్టిపారేశారు. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని, ఫోరెన్సిక్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నివేదికలు అందిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిబంధనల మేరకు అవసరమైతే అరెస్ట్ చేసే అంశాన్ని పరిశీలిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

## కబ్జాకోరులపై సీపీ సుమతి పంజా

**వృద్ధురాలికి దక్కిన రూ.40 కోట్ల భూమి**

హైదరాబాద్, ఆగస్టు 21 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో 80 ఏళ్ల ఓ వృద్ధురాలు భూకబ్జాదారుల చెర నుంచి తన రూ. 40 కోట్ల విలువైన ఆస్తిని దక్కించుకున్నారు. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ (సీపీ) సుమతి చొరవతో ఆమెకు సకాలంలో న్యాయం చేకూరింది. రాజకీయ ఒత్తిళ్లను సైతం లెక్కచేయకుండా నిందితులపై కఠినంగా వ్యవహరించి, వృద్ధురాలికి బాసటగా నిలిచిన సీపీపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. మల్కాజ్‌గిరి ప్రాంతానికి చెందిన సదరు మహిళకు సుమారు రూ. 40 కోట్ల విలువైన ఖాళీ స్థలం ఉంది. దశాబ్దాలుగా ఆ భూమి ఆమె స్వాధీనంలోనే ఉన్నప్పటికీ, ఇటీవల కొందరు భూకబ్జాదారులు ఆ ఆస్తిపై కన్నేశారు. అక్రమంగా స్థలంలోకి చొరబడి, అది తమదేనంటూ సదరు వృద్ధురాలిని భయభ్రాంతులకు గురిచేశారు. ఈ క్రమంలో బాధిత మహిళ ధైర్యంతో మల్కాజ్‌గిరి సీపీ సుమతిని ఆశ్రయించారు. తన భూమికి సంబంధించిన అన్ని దస్తావేజులను సమర్పించి, న్యాయం చేయాలని ఆమెను అభ్యర్థించారు. వృద్ధురాలి ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన సీపీ సుమతి, సమగ్ర విచారణకు ఆదేశించారు. రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, ఆ భూమి బాధితురాలిదేనని ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే, ఈ వ్యవహారంలో అధికార పార్టీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధుల ద్వారా కబ్జాదారులు ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. అయినప్పటికీ సీపీ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా, ఆ స్థలం తమదేనని వాదిస్తున్న వారిని పిలిపించి ఆధారాలు సమర్పించాలని ఆదేశించారు. వారు సరైన పత్రాలను చూపలేకపోవడంతో, ఆ భూమి వృద్ధురాలిదేనని అధికారులు తుది నిర్ధారణకు వచ్చారు. కోట్లాది రూపాయల విలువైన తన ఆస్తి తిరిగి దక్కడంతో ఆ వృద్ధురాలు హర్షం వ్యక్తం చేశారు. సీపీ సుమతి ప్రదర్శించిన చొరవను, వృత్తిపరమైన నిబద్ధతను స్థానికులు కొనియాడుతున్నారు. భూకబ్జాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

## ధర్మపురి అర్వింద్‌ది అతి తెలివి: ఆది శ్రీనివాస్

హైదరాబాద్, ఆగస్టు 21 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలపై విమర్శలు చేస్తున్నారంటూ నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్‌పై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ అధికారిక అనుమతులతోనే ముఖ్యమంత్రి పర్యటనకు వెళ్లారని, దాన్ని కూడా రాజకీయం చేయడం బీజేపీ నేతల దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. లండన్‌లోని ప్రముఖ విద్యా సంస్థలు, క్రీడా ప్రాంగణాలను సందర్శించి తెలంగాణకు ఉపయోగపడే ప్రమాణాలను సీఎం పరిశీలిస్తుంటే బీజేపీ నాయకులకు కడుపునొప్పి ఎందుకని ఆయన ప్రశ్నించారు. అర్వింద్ అతితెలివి ప్రదర్శిస్తూ "భారత వ్యతిరేక శక్తులను కలవడానికే సీఎం వెళ్లారు" అని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. 2014 నుంచి ప్రధాని నరేంద్ర మోదీ 103 విదేశీ పర్యటనలు చేసి 82 దేశాలు తిరిగారని గుర్తుచేసిన ఆది శ్రీనివాస్, ప్రధాని కూడా పనిలేక తిరిగారా అని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి తన మూడేళ్ల పాలనలో కేవలం రెండుసార్లు దావోస్‌కు, ఒకసారి అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలకు మాత్రమే వెళ్లారని వివరించారు. ఏదో రకంగా తెలంగాణలో అధికారంలోకి వస్తామన్న అర్వింద్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ... అక్రమ మార్గాల్లో అధికారంలోకి రావడం వారికి అలవాటేనని ఆయన ఒప్పుకుంటున్నారని విమర్శించారు.

## మల్యాలలో పట్టపగలే ఇంట్లో చోరీ

**3 తులాల బంగారం, రూ.1.50 లక్షల నగదు అపహరణ**

మల్యాల, ఆగస్టు 21 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలోని బ్లాక్ ఏరియాలో తాళం వేసిన ఇంట్లో శుక్రవారం పట్టపగలే చోరీ జరిగింది. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఇంటి యజమాని వేముల గీతిక ఆలయానికి వెళ్లిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించినట్లు తెలుస్తోంది. ఇంట్లోని వస్తువులను చిందరవందర చేసి మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదు, ఆరు తులాల వెండి ఆభరణాలను అపహరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పూజలు ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చిన గీతిక చోరీని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, పరిసరాల్లో విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తూ నిందితుల కోసం గాలిస్తున్నట్లు తెలిసింది.

## వరలక్ష్మీ వ్రతంతో కళకళలాడిన మహాలక్ష్మీ ఆలయం

వేములవాడ అర్బన్, ఆగస్టు 21 (ఈవార్తలు): శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ శ్రీ మహాలక్ష్మీ ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీ రాజరాజేశ్వరీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, సాయంత్రం మహాలక్ష్మీ అమ్మవారికి షోడశోపచార పూజలు నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని ఒడిబియ్యం, గాజులు, చీరలు, సారెలు సమర్పించి కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. కుటుంబ సౌఖ్యం, ఐశ్వర్యం కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు, చలువ పందిళ్లు, తాగునీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని మామిడి ఆకుల తోరణాలు, కొబ్బరి ఆకులు, పూలతో అలంకరించారు.

## విద్యార్థులు లక్ష్యసాధన దిశగా సాగాలి

**కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్**

మెట్‌పల్లి, ఆగస్టు 21 (ఈవార్తలు): విద్యార్థులు చిన్ననాటి నుంచే లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సూచించారు. మెట్‌పల్లి మైనారిటీ పాఠశాలతో పాటు మెట్లచిట్టాపూర్ మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, లక్ష్యాలు, భవిష్యత్ ఆశయాలను తెలుసుకున్నారు. చదువుతో పాటు క్రీడలు, సృజనాత్మక రంగాల్లోనూ ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాలల్లోని మౌలిక వసతులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, అవసరాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

## రైతు కుటుంబానికి అండగా నిలవాలి

**వితంతు పెన్షన్, ఇందిరమ్మ ఇంటి బిల్లులు చెల్లించాలి: జీవన్‌రెడ్డి**

సారంగాపూర్, ఆగస్టు 21 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం తలుపులగూడెంలో ఇటీవల మృతి చెందిన రైతు కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకుడు జీవన్‌రెడ్డి పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆయన మృతుడి భార్యకు వెంటనే వితంతు పెన్షన్ మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులకు సూచించారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైనప్పటికీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తలుపులగూడెంలో బ్రిడ్జి కొట్టుకుపోవడంతో మరమ్మతుల కోసం రూ.7 లక్షలు మంజూరైనా పనులు పూర్తికాలేదని జీవన్‌రెడ్డి తెలిపారు. పైప్‌లైన్‌కు రక్షణగా సిమెంట్ లేయర్ ఏర్పాటు చేసి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. గ్రామానికి ఈ మార్గం ఒక్కటే ప్రధాన రహదారి కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడిన ఆయన గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ కార్యక్రమాలను ప్రస్తావించారు. గ్రామస్థులు కూడా గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు మెరుగ్గా అమలయ్యాయని అభిప్రాయపడినట్లు తెలిపారు.

## ఇంటికో మీల్ టోకెన్

**నూకపల్లి కాలనీలో భోజన టోకెన్లపై అసంతృప్తి**

మల్యాల, ఆగస్టు 21 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ముఖాముఖి కార్యక్రమానికి సంబంధించి భోజన టోకెన్లు, రవాణా సౌకర్యంపై కొందరు లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్‌కుమార్, మేడిపల్లి సత్యం పాల్గొన్న కార్యక్రమానికి నూకపల్లి కాలనీ వాసులకు మున్సిపల్ సిబ్బంది టోకెన్లు పంపిణీ చేశారు. ఇంటికి ఒక్కరికి మాత్రమే భోజనం అందిస్తామని చెప్పడంపై కొందరు లబ్ధిదారులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అదే సమయంలో కాలనీ నుంచి కార్యక్రమం జరిగే ప్రాంతానికి తగిన రవాణా సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు సమాచారం. ప్రభుత్వ కార్యక్రమానికి ఆహ్వానించిన లబ్ధిదారులకు భోజనం, రవాణా వంటి కనీస సౌకర్యాల విషయంలో ముందస్తు ప్రణాళిక అవసరమని పలువురు అభిప్రాయపడ్డారు.

## ప్రివెంటివ్ కస్టడీ అప్రజాస్వామికం: బీఆర్ఎస్

జగిత్యాల, ఆగస్టు 21 (ఈవార్తలు): రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జగిత్యాల పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అదుపులోకి తీసుకోవడాన్ని ఆ పార్టీ నాయకులు ఖండించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడం రాజకీయ పార్టీలకు ఉన్న ప్రజాస్వామ్య హక్కులని వారు పేర్కొన్నారు. మంత్రి పర్యటన సందర్భంగా నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకోవడం సరికాదన్నారు. పోలీసు చర్యలతో ప్రజా సమస్యలపై తమ పోరాటాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. ఈ మేరకు దావ సురేష్, శీలం ప్రవీణ్, గాజుల రాజేందర్, చెట్పల్లి సుధాకర్, చింతల గంగాధర్, సామల రాజశేఖర్, అల్లాల రమేష్‌రావు, గంగారెడ్డి, ప్రణయ్, మనోజ్, సల్మాన్, లక్ష్మణ్, నక్క జీవన్, నవీన్ తదితరులు పేర్కొన్నారు.

## నాంపల్లిగుట్ట సుందరీకరణ వేగవంతం

**గడువులోగా పూర్తి చేయాలి: సిరిసిల్ల కలెక్టర్ గరిమ**

వేములవాడ అర్బన్, ఆగస్టు 21 (ఈవార్తలు): నాంపల్లిగుట్టపై వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న సుందరీకరణ పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం పరిశీలించారు. నాంపల్లిగుట్టకు తరలించిన భారత వాయుసేన విమానాన్ని ఏర్పాటు చేయడంతో పాటు చేపడుతున్న ఇతర అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి భక్తులు, పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నాంపల్లిగుట్టపై ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కలెక్టర్ పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆమెకు స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ కేవీఎస్‌బీ కుమారి, తహసీల్దార్ జయంత్‌కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## సూర్య ధన్వంతరి ఆలయంలో ఘనంగా వరలక్ష్మీ వ్రతం పూజలు

జగిత్యాల, ఆగస్టు 21 (ఈవార్తలు): శ్రావణమాసం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువు సమీపంలోని శ్రీ సూర్య ధన్వంతరి ధనలక్ష్మి సహిత దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ ధనలక్ష్మి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, పంచామృత అభిషేకం, పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం చేపట్టారు. పారాయణం అనంతరం మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి, ముడుపులు కట్టారు. శ్రావణమాసం సందర్భంగా కుంకుమ పూజలో పాల్గొన్న భక్తుల్లో లక్కీడిప్ ద్వారా ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, తాంబూలాన్ని ఆలయ పూజారి ఆశీర్వచనాలతో అందించారు. కార్యక్రమంలో దేవాలయ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి భారతాల సాగర్--గీత, మహిళా సభ్యులు వడ్లగట్ట స్వాతి, అంజలి, కావ్య, ప్రసన్న, రజిత, పుష్పలత, లక్ష్మి, యశోద, జ్యోతి, ఉషారాణి, సన్నిహిత, అర్చకుడు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## భీమేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



వేములవాడ అర్బన్, ఆగస్టు 21 (ఈవార్తలు): శ్రావణమాసం రెండో శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ శ్రీ భీమేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు భీమేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించి కోడె మొక్కులు సమర్పించారు. అనంతరం మాత మాణిక్యాంబ, గాయత్రీమాత, మహాలక్ష్మీదేవికి ఒడిబియ్యం, గాజులు, చీరలు, సారెలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక క్యూలైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత, ప్రసాదాల పంపిణీ, పార్కింగ్ తదితర ఏర్పాట్లు చేశారు. ఈవో రమాదేవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## సినారె కళామందిరం సుందరీకరణకు ప్రతిపాదనలు

వేములవాడ అర్బన్, ఆగస్టు 21 (ఈవార్తలు): వేములవాడ పట్టణంలోని సినారె కళామందిరం సుందరీకరణ పనులకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కళామందిరాన్ని పరిశీలించిన కలెక్టర్ భవనం, పరిసరాలను పరిశీలించారు. సుందరీకరణ, విద్యుద్దీపాల ఏర్పాటు, కుర్చీలు, ధ్వని వ్యవస్థ, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన పూర్తి ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. పరిశీలనలో ఆర్డీఓ కేవీఎస్‌బీ కుమారి, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్, ఎంపీడీఓ, టీపీఓ అన్సార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పేదకు ఇందిరమ్మ ఇల్లు

**నూకపల్లిలో మౌలిక వసతుల కల్పన**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి**

**జగిత్యాలలో పర్యటన విజయవంతం**



జగిత్యాల, ఆగస్టు 21 (ఈవార్తలు): కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. జగిత్యాల పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్‌కుమార్, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ సంస్థ ఎండీ గౌతమ్, జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ తదితరులతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పేదల సంక్షేమంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు.

**నూకపల్లి కాలనీకి రూ.32 కోట్లు**

నూకపల్లి 2బీహెచ్‌కే కాలనీలో మౌలిక వసతుల కల్పనలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మంత్రి ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి దశలో రూ.32 కోట్లతో తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. రెండో దశలో పాఠశాల ఏర్పాటుకు త్వరలో నిధులు విడుదల చేస్తామని చెప్పారు. కాలనీలో రేషన్ దుకాణం, బస్సు సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2008లో పునాది వేసిన కాలనీలో 18 ఏళ్ల తర్వాత మౌలిక వసతులతో ఇళ్లను అందుబాటులోకి తీసుకురాగలిగామని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం మరోసారి ప్రకటన జారీ చేసి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని, క్షేత్రస్థాయిలో విచారణ అనంతరం అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.

**భూ రీ సర్వేతో శాశ్వత పరిష్కారం**

భూ రీ సర్వే ద్వారా రాష్ట్రంలోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పొంగులేటి తెలిపారు. ఏడాదిన్నరలోగా వ్యవసాయ భూములతో పాటు ఆబాది ఆస్తుల రీ సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీ సర్వే నిర్వహిస్తున్నామని, జగిత్యాల జిల్లాలోనూ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. రీ సర్వే అనంతరం అర్హులైన రైతులందరికీ పట్టాదారు పాస్‌పుస్తకాలు అందిస్తామని తెలిపారు. నకిలీ పాస్‌పుస్తకాలను గుర్తించి రద్దు చేస్తామని చెప్పారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ నూకపల్లి కాలనీలో పెండింగ్ పనులు, మౌలిక వసతుల కోసం ప్రభుత్వం రూ.72 కోట్లు మంజూరు చేసిందన్నారు. పాత ట్రాక్టర్ ఉన్న కారణంగా కొందరు అర్హులు ఇందిరమ్మ ఇళ్లకు దూరమవుతున్నారని, అలాంటి కుటుంబాలకు నిబంధనల్లో సడలింపు కల్పించాలని కోరారు. ధర్మపురి రెవెన్యూ డివిజన్‌తో పాటు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని మంత్రి పొంగులేటిని కోరారు. ఎమ్మెల్సీ ఎల్.రమణ మాట్లాడుతూ నూకపల్లి కాలనీలో 4,500 ఇళ్లు నిర్మించినప్పటికీ ప్రస్తుతం సుమారు సగం ఇళ్లలోనే ప్రజలు నివసిస్తున్నారని తెలిపారు. రవాణా సౌకర్యం, సెల్‌ఫోన్ టవర్లు తదితర మౌలిక వసతులు కల్పించాలని కోరారు.



## మాస్టర్ స్విమ్మింగ్‌లో అంబర్‌పేట్ క్రీడాకారుల సత్తా

హైదరాబాద్, ఆగస్టు 21 (ఈవార్తలు): అంబర్‌పేట్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్విమ్మింగ్ పూల్‌లో ఆగస్టు 15న నిర్వహించిన 11వ తెలంగాణ మాస్టర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్-2026లో అంబర్‌పేట్ క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఇంద్రసేన యాదవ్ ఐదు స్వర్ణ పతకాలు సాధించి రాష్ట్రస్థాయిలో తొలి ర్యాంక్ సాధించారు. వి.రమణ నాలుగు పతకాలు, రాజ్‌కుమార్ సురానా నాలుగు స్వర్ణాలు, ఒక రజతం, మధు మూడు స్వర్ణాలు, రెండు రజతాలు, మురళీధర్‌రెడ్డి రెండు రజత పతకాలు సాధించారు. విజేతలను అంబర్‌పేట్ మాజీ కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్ అభినందించి సన్మానించారు. క్రీడాకారుల విజయానికి కృషి చేసిన కోచ్‌లు కె.సురేష్, ప్రశాంత్, సుదీర్, కృష్ణ, గిరిలను నిర్వాహకులు అభినందించారు.

## తిరంగా ర్యాలీపై కేసు నమోదు అక్రమం

**హైకోర్టును ఆశ్రయిస్తా: లడ్డు యాదవ్**

అఫ్జల్‌గంజ్/హైదరాబాద్, ఆగస్టు 21 (ఈవార్తలు): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన తిరంగా ర్యాలీపై అఫ్జల్‌గంజ్ పోలీసులు కేసు నమోదు చేయడం అన్యాయమని భగత్‌సింగ్ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు లడ్డు యాదవ్ ఆరోపించారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బేగంబజార్ ఛత్రి నుంచి భగత్‌సింగ్ యువసేన ఆధ్వర్యంలో దేశభక్తి కార్యక్రమంగా తిరంగా ర్యాలీ నిర్వహించామని తెలిపారు. అలాంటి కార్యక్రమంపై కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. గతంలో శాయినాథ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తనపై నమోదైన కేసును నాంపల్లి 16వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు కొట్టివేసిందని గుర్తు చేశారు. ప్రస్తుత కేసును కూడా న్యాయస్థానంలో సవాలు చేస్తానని తెలిపారు. తనపై కేసు నమోదు వెనుక ఎవరి ఒత్తిడి ఉందో ప్రభుత్వం, పోలీసు అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కేసును సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయిస్తానని చెప్పారు.

## రేపు ఎస్వీకేలో పద్మశాలి వధూవరుల పరిచయ వేదిక

హైదరాబాద్, ఆగస్టు 21 (ఈవార్తలు): తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో 10వ రాష్ట్రస్థాయి పద్మశాలి వధూవరుల వివాహ పరిచయ వేదికను ఆగస్టు 23న నిర్వహించనున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కార్యక్రమం జరుగుతుందని ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోడం రవిప్రకాష్, ప్రధాన కార్యదర్శి గుర్రపు రాజమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. 2015 నుంచి పద్మశాలి మ్యారేజ్ బ్యూరోను సేవా దృక్పథంతో నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు వందల సంఖ్యలో వివాహాలు కుదిరాయని తెలిపారు. ఎలాంటి మధ్యవర్తిత్వం, కమిషన్ లేకుండా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వధూవరులు పూర్తి వివరాలు, పాస్‌పోర్టు సైజు ఫొటోతో హాజరుకావాలని కోరారు. అక్కడికక్కడే నమోదు అవకాశం ఉందని, గతంలో సంఘం మ్యారేజ్ బ్యూరోలో నమోదు చేసుకున్న వారికి మరోసారి నమోదు అవసరం లేదని తెలిపారు. మరిన్ని వివరాలకు కార్యాలయ కార్యదర్శి ములుక శ్రీనివాస్‌ను 9704360703లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ పుంజుకుంటోంది: సీపీఐ నారాయణ

హైదరాబాద్, ఆగస్టు 21 (ఈవార్తలు): తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాలు తీవ్రమవుతున్నాయని, నాయకుల మధ్య సవతుల పోరు నడుస్తోందని సీపీఐ సీనియర్ నేత నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నేతల అంతర్గత విభేదాల కారణం వల్ల రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ పుంజుకుంటోందని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్కడా తప్పులు చేయకుండా నిక్కచ్చిగా వ్యవహరించినప్పుడే మంత్రులు, కిందిస్థాయి అధికారులలో భయం ఉంటుందని నారాయణ పేర్కొన్నారు. సీఎం ఇప్పటికైనా రాజకీయాలను పక్కనపెట్టి పూర్తిస్థాయిలో పాలనపైనే దృష్టి సారించాలని సూచించారు.

# ఖేలో ఇండియా క్రీడా రంగంలో పెనుమార్పు

**బ్యాడ్మింటన్ క్రీడాకారిణి గుత్తా జ్వాల మద్దతు**



హైదరాబాద్, ఆగస్టు 21: పునరుద్ధరించిన ఖేలో ఇండియా పథకం భారత క్రీడారంగంలో పెనుమార్పు తీసుకురాగలదని రెండుసార్లు ఒలింపిక్స్‌లో పాల్గొన్న బ్యాడ్మింటన్ క్రీడాకారిణి జ్వాలా గుత్తా అన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ క్రీడా ప్రతిభను క్షేత్రస్థాయి నుంచే గుర్తించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కొత్త రూపంలోని ఖేలో ఇండియా పథకం ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ పథకం మరింత ముందుగానే రావాల్సి ఉందన్నారు. 2026-31 కాలానికి పునరుద్ధరించిన ఖేలో ఇండియా పథకానికి గత కేటాయింపులతో పోలిస్తే ఎనిమిది రెట్లు పెంచి రూ.29,054 కోట్లు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. పథకం ద్వారా మద్దతు పొందే క్రీడాకారుల సంఖ్యను పది రెట్లు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో ఇప్పటికే 33 ఖేలో ఇండియా కేంద్రాలు మంజూరయ్యాయని, వీటి ద్వారా 601 మందికి పైగా క్రీడాకారులకు శిక్షణ అందుతోందని తెలిపారు. మేడ్చల్--మల్కాజ్‌గిరిలో ఖేలో ఇండియా స్టేట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో రోయింగ్, వెయిట్‌లిఫ్టింగ్, ఫెన్సింగ్ తదితర క్రీడాంశాల్లో 254 మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారని వివరించారు. రాష్ట్రంలో అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, షూటింగ్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, సైక్లింగ్, టెన్నిస్, ఫుట్‌బాల్ తదితర క్రీడల్లో 19 ఖేలో ఇండియా గుర్తింపు పొందిన అకాడమీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మహిళల కోసం నిర్వహించిన 127 అస్మిత లీగ్‌లలో 20,921 మంది పాల్గొన్నారని పేర్కొన్నారు. జ్వాలా గుత్తా మాట్లాడుతూ తాను కూడా ప్రభుత్వ ప్రోత్సాహంతోనే ఎదిగానని, ప్రభుత్వ మద్దతు లేకుండా తన విజయాలు సాధ్యమయ్యేవి కాదన్నారు. క్షేత్రస్థాయి నుంచే క్రీడా ప్రతిభను పెంపొందించడంపై దృష్టి సారించడం వల్ల తల్లిదండ్రులు పిల్లలను క్రీడల్లోకి పంపేందుకు మరింత విశ్వాసం కలుగుతుందని అన్నారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ వైస్‌చైర్‌పర్సన్, ఎండీ డాక్టర్ ఏ.సోనిబాలాదేవి మాట్లాడుతూ కేంద్ర-రాష్ట్రాల భాగస్వామ్యంతో క్రీడా రంగంలో దీర్ఘకాలిక ప్రణాళికలకు ఈ పథకం దోహదపడుతుందని అన్నారు. ఈ ఏడాది చివర్లో తెలంగాణ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇవ్వనుందని తెలిపారు.



## పేద మహిళలకు చీరల పంపిణీ

**సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం**

వేములవాడ అర్బన్, ఆగస్టు 21 (ఈవార్తలు): వరలక్ష్మీ వ్రతం సందర్భంగా సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి 22వ వార్డు కౌన్సిలర్ ఇప్పపూల మమత--అజయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రస్ట్ ప్రారంభమైన కొద్దికాలంలోనే పేదలకు వివిధ సేవలు అందించడం అభినందనీయమన్నారు. మహిళా విభాగం ద్వారా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎద్దండి రాజు--సరళ మాట్లాడుతూ మహిళలకు సేవ చేయాలనే ఉద్దేశంతో మహిళా విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమాజ సేవలో ట్రస్ట్ ముందుంటుందని చెప్పారు. కార్యక్రమంలో దూలం లలిత, పిల్లి రోహిణి, గొంటి సమత, అడిగొప్పుల విద్యాశ్రీ, దూలం భూమేష్‌గౌడ్, వాసాల హరిప్రసాద్, గొంటి నవీన్ తదితరులు పాల్గొన్నారు.




## వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో సీఐఎస్ఎఫ్ సిబ్బంది ఉపసంహారణ

వైజాగ్/న్యూఢిల్లీ, ఆగస్టు 21 (ఈవార్తలు): ఏపీలోని వైజాగ్ స్టీల్ ప్లాంట్ విషయంలో కేంద్రం సంచలన నిర్ణయం తీసుకుంది. దీనిని ప్రైవేటీకరణ్ చేస్తారనే అనుకుంటున్న తరుణంలో మొత్తం సీఐఎస్ఎఫ్ సిబ్బందిని వెనక్కి తీసుకోవాలని కేంద్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మూడు నెలలపాటు గడువు ఇచ్చి నవంబర్ 17 నాటికి యూనిట్ మొత్తం ఖాళీ చేయాలని ఆదేశించింది. దీంతో స్టీల్ ప్లాంట్ భద్రతపై అయోమయం నెలకొంది. 2024 వరకూ స్టీల్ ప్లాంట్‌లో 1500 మంది వరకు సీఐఎస్ఎఫ్ బలగాలు విధులు నిర్వహించాయి. అనంతరం దశల వారీగా సిబ్బంది ఉపసంహరిస్తూ వచ్చారు. ప్రస్తుతం స్టీల్ ప్లాంట్‌లో కొనసాగుతున్న 350 మంది సెక్యూరిటీ, 120 మంది ఫైర్ సేఫ్టీ సిబ్బందిని ఇప్పుడు వెనక్కి తీసుకోవాలని కేంద్రం హోంశాఖ ఆదేశాలు జారీ చేయడంతో కొత్త సందేహాలు నెలకొంటున్నాయి.



## ఏడాది ప్రాక్టీస్ చాలు

**లా గ్రాడ్యుయేట్లకు సుప్రీం ఉపశమనం**

న్యూఢిల్లీ: లా గ్రాడ్యుయేట్లకు సుప్రీంకోర్టు పెద్ద ఉపశమనం కలిగించింది. జ్యుడీషియల్ పరీక్ష రాసేందుకు న్యాయవాదిగా తప్పనిసరిగా మూడేండ్లు న్యాయవాద వృత్తిని చేసి ఉండాలనే నిబంధనను సడలించింది. దానిని ఏడాదికి తగ్గించినట్టు ప్రకటించింది. అయితే ఎన్నికైన అభ్యర్థులు జ్యుడీషియల్ అకాడమీలో శిక్షణ, తర్వాత ఏడాది పాటు క్లర్క్‌షిప్ చేయాలని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్‌లు ఎంజీ మసీహ్, కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం 2:1తో భిన్న నిర్ణయాన్ని ప్రకటించాయి. ప్రాథమిక స్థాయి జ్యుడీషియల్ పరీక్ష రాసేందుకు అభ్యర్థులు తప్పనిసరిగా మూడేండ్ల పాటు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసి ఉండాలని అప్పటి చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం గత ఏడాది మే 20న ప్రకటించి, దానిని అమలు చేస్తున్నది. అయితే దానిని మార్పు చేస్తూ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం తీర్పు చెప్పింది.



## ఫ్లాట్‌గా స్టాక్ మార్కెట్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం దాదాపు ఫ్లాట్‌గా ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూల పరిస్థితులు, బాండ్ ఈల్డ్స్ పెరగడం, ముడిచమురు ధరల్లో పెరుగుదల ఇన్వెస్టర్లను అప్రమత్తం చేశాయి. అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. సెన్సెక్స్ 3.11 పాయింట్లు పెరిగి 77,540.83 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 20.15 పాయింట్లు లాభపడి 24,252.00 వద్ద ముగిసింది. నిఫ్టీ 0.08 శాతం పెరిగింది. నిఫ్టీకి 24,000-24,200 స్థాయి కీలక మద్దతుగా ఉంటుందని మార్కెట్ నిపుణులు తెలిపారు. పైస్థాయిలో 24,300-24,400 మధ్య నిరోధం ఉందని చెప్పారు. ఈ స్థాయిని దాటితే నిఫ్టీ 24,500-24,600 వరకు పుంజుకునే అవకాశం ఉందని అంచనా వేశారు. ప్రధానంగా నష్టపోయిన షేర్లలో ట్రెంట్, మారుతీ సుజుకీ ఇండియా, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ఉన్నాయి. మరోవైపు విస్తృత మార్కెట్‌లో కొంత ఉత్సాహం కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.1 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 0.69 శాతం లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే ఎఫ్‌ఎంసీజీ, ఆటో, ఐటీ సూచీలు వెనుకబడ్డాయి. మెటల్, ప్రైవేట్ బ్యాంక్ సూచీలు మెరుగ్గా రాణించాయి.



## దేశంలో స్వైన్ ఫ్లూ కేసులు

**కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా సమీక్ష**

న్యూఢిల్లీ: దేశంలో స్వైన్ ఫ్లూ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో, జాతీయ స్థాయి సన్నద్ధత, నివారణ చర్యలపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా నిరంతర నిఘా, వ్యాధి వ్యాప్తి నిరోధక చర్యలు పటిష్ఠంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఢిల్లీతో పాటు ఇతర ప్రధాన ప్రాంతాల్లోని ఆసుపత్రులలో బెడ్ల లభ్యత, ఐసోలేషన్ వార్డుల ఏర్పాటుతో పాటు అవసరమైన మందులు, టీకాల లభ్యతపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, హెల్త్ సెక్రటరీలతో కూడిన బృందానికి నిరంతరం కేసులను పర్యవేక్షించాలని సూచించారు. ముఖ్యంగా వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ముందస్తుగా గుర్తించడం, బాధితులకు సకాలంలో చికిత్స అందించడం.. ప్రజల్లో పరిశుభ్రత, అవగాహన పెంపొందించడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాలు, మారుమూల జిల్లాల్లో కూడా అవసరమైన ఫ్లూ నిరోధక మందుల కొరత లేకుండా చూడాలని అన్ని రాష్ట్రాల ఆరోగ్య శాఖలను కోరారు.

# కుల రిజర్వేషన్లు వద్దు

**జంతర్ మంతర్ వద్ద సీజేపీ నిరసన**



న్యూఢిల్లీ: కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) ఆధ్వర్యంలో 45 రోజులపాటు నిరసనలకు వేదికైన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శుక్రవారం మరో భారీ ప్రదర్శన జరిగింది. కుల ఆధారిత రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వేల సంఖ్యలో నిరసనకారులు తాజా ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రధానంగా అగ్రవర్ణాలకు చెందిన ఈ నిరసనకారులు యూజీసీ సమానత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించడంతోపాటు కుల ప్రాతిపదికన ఉన్న రిజర్వేషన్ విధానంలో సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ రిఫార్మ ఆందోళన్ ఆధ్వర్యంలో నీట్ అభ్యర్థి మర్ష్ దూబె నాయకత్వంలో శుక్రవారం జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో రాజస్థాన్‌కు చెందిన జనరల్ సేన, చాణక్య సేనలతోపాటు కర్ణిసేన కూడా పాల్గొన్నాయి. అయితే ఈ ప్రదర్శన నిర్వహణకు అనుమతి విషయంలో కొంత గందరగోళం నెలకొంది. ఇన్‌ఫ్లుయెన్సర్ అజీత్ భారతి కూడా ఇందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిరసనకారులు హనుమాన్ చాలీసా పఠిస్తూ సియావర్ రామచంద్ర కీజై అని నినాదాలు చేశారు. ఇలాఉండగా, రిజర్వేషన్ హటావో ఆందోళన్(ఆర్‌హెచ్‌ఏ) అనే ఇన్‌స్టాగ్రామ్ పేజీ ఇచ్చిన పిలుపు మేరకు జంతర్ మంతర్ వద్ద ప్రత్యక్షంగా నిరసనలో పాల్గొనడానికి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఈ నిరసన ప్రదర్శనకు అనుమతి ఇవ్వలేదని పోలీసులు తెలిపారు. నెలరోజుల క్రితమే తాము దరఖాస్తు చేసుకున్నామని, చివరి నిమిషంలో తమకు జంతర్ మంతర్ వద్ద కాకుండా రామ్‌లీలా మైదాన్‌లో నిరసనకు పోలీసులు అనుమతి ఇచ్చారని ఆర్‌హెచ్‌ఏ ప్రతినిధులు తెలిపారు. జంతర్ మంతర్ వద్దనే శాంతియుతంగా ఆందోళన నిర్వహించడానికి తమను అనుమతించాలని వారు ఆందోళనకు దిగారు. కాగా, నిరసనకారులు కోరిన మేరకు జంతర్ మంతర్ వద్ద కాకుండా రామ్‌లీలా మైదాన్‌లో నిరసన కార్యక్రమం జరుపుకోవాలని పోలీసులు తమ అనుమతి పత్రంలో పేర్కొన్నారు. శాంతి భద్రతల దృష్ట్యా నిరసన కార్యక్రమానికి తమకు ఎటువంటి అభ్యంతరం లేదని పేర్కొంటూ సాయంత్రం 4 గంటల వరకు రామ్‌లీలా మైదానంలో గరిష్ఠంగా 500 మంది గుమికూడేందుకు ఢిల్లీ పోలీసులు అనుమతి ఇచ్చారు. ఇలా ఉండగా కుల ఆధారిత రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తలపెట్టిన నిరసన నేపథ్యంలో జంతర్ మంతర్ వద్ద భద్రతను పోలీసులు కట్టుదిట్టం చేశారు. శుక్రవారం ఉదయం కొంతమంది నిరసన స్థలం వద్ద గుమికూడగా ఎటువంటి అనుమతి లేకపోవడంతో పోలీసులు వారిని వెంటనే అక్కడి నుంచి పంపించివేశారు. కాగా జంతర్ మంతర్ వద్ద నిరసన కోసం నెల రోజుల క్రితమే అనుమతి కోరామని ఆర్‌హెచ్‌ఏ తెలిపింది. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు హఠాత్తుగా వేదికను జంతర్ మంతర్ నుంచి రామ్‌లీలా మైదానానికి మార్చారని, ఇందులో పాల్గొనేవారి సంఖ్యను 500కి పరిమితం చేశారని ఆర్‌హెచ్‌ఏ ఢిల్లీ పోలీసులపై ఆగ్రహం ప్రకటించింది.

# రాహుల్ మెరుపు ధర్నా

**పెల్లెట్ గన్ బాధితుడితో కలిసి ఎఫ్ఐఆర్ కోసం డిమాండ్**



న్యూఢిల్లీ: పెల్లెట్ గన్ గాయాల వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం ఢిల్లీలో ఆందోళనకు దిగారు. జులై 20న జరిగిన జెన్-జీ విద్యార్థుల నిరసనల్లో పెల్లెట్ గన్ గాయాలయ్యాయని ఆరోపిస్తున్న సాహిల్ లోచాబ్‌ను వెంటబెట్టుకుని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అనంతరం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం బయట బాధితుడితో కలిసి ధర్నాకు కూర్చున్నారు. జులై 20న పరీక్షల పేపర్ లీక్‌లకు నిరసనగా వందలాది మంది విద్యార్థులు పార్లమెంట్ వైపు మార్చ్ చేపట్టిన విషయం తెలిసిందే. ఆ సమయంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. 'ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్' (ఆర్ఏఎఫ్) సిబ్బంది పెల్లెట్ గన్స్ ఉపయోగించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ ఘటనలో గాయపడినట్లు పలువురు నిరసనకారులు చెప్పడంతో పాటు వైద్య నివేదికలు కూడా ఉన్నాయని కాంగ్రెస్ పేర్కొంది. అయితే జులై 20న పెల్లెట్ గన్స్ ఉపయోగించలేదని ఢిల్లీ పోలీసులు పలుసార్లు తెలిపారు. ఈ అంశంపై సీఆర్‌పీఎఫ్ మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు. మరోవైపు, గాయపడిన నిరసనకారుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలు పెల్లెట్ గన్స్ వాడలేదన్న వాదనపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని కాంగ్రెస్ పేర్కొంది.

**స్మృతి ఇరానీ తీవ్ర విమర్శలు**

రాహుల్ గాంధీ మెరుపు ధర్నాపై కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జులై 20న జరిగిన విద్యార్థుల నిరసనల్లో పెల్లెట్ గన్ల దాడికి గురై తీవ్రంగా గాయపడిన 19 ఏళ్ల సాహిల్ లోచాబ్‌కు మద్దతుగా, ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలతో పాటు ఇతర సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆకస్మిక ధర్నాకు దిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి స్మృతి ఇరానీ మాట్లాడుతూ, రాహుల్ గాంధీ ధర్నాపై విమర్శలు గుప్పించారు. రాహుల్ గాంధీ కేవలం తనకు అనుకూలమైన రాజకీయ ప్రయోజనాల కోసమే ఇటువంటి వైఖరి తీసుకుంటున్నారని, అక్కడ ఉన్న ఆధారాలు ఆయన మాటలకు సరిపోలుతున్నాయా అని ప్రశ్నించారు. జార్ఖండ్ వంటి ఇతర రాష్ట్రాల్లో పరిస్థితులపై ఎందుకు మాట్లాడటం లేదని నిలదీసిన ఆమె.. వ్యవస్థను మెరుగుపరచడానికి ఎటువంటి నిర్మాణాత్మక సూచనలు ఇవ్వకుండా కేవలం నాటకీయ నిరసనలు తెలపడం రాహుల్ కు పరిపాటిగా మారిందని ఆరోపించారు. అయితే, యువత ఆందోళనలను ప్రభుత్వం ఎల్లప్పుడూ నిశితంగా గమనిస్తూ పరిష్కరిస్తుందని ఆమె స్పష్టం చేశారు.

## టర్కీ ఆయుధాల నౌక అపహరణ

**భారతీయులతో సహా సిబ్బంది బందీ**

న్యూఢిల్లీ: సోమాలియా తీరంలో టర్కీకి చెందిన ఆయుధాలు, సైనిక పరికరాలను తీసుకెళ్తున్న ఒక భారీ సరుకు రవాణా నౌకను సోమాలియా పైరేట్లు (సముద్రపు దొంగలు) అపహరించిన ఘటన అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపింది. కేమరూన్ ఫ్లాగ్‌తో ప్రయాణిస్తున్న 'ఎం/వీ లుటుఫ్' అనే ఈ నౌక పోలార్ మూవ్‌మెంట్ షిప్పింగ్ సంస్థకు చెందినదిగా గుర్తించారు. సోమాలియాలోని పుంట్‌ల్యాండ్ పరిధిలోని ఎయిల్ జిల్లా మార్రాయా తీరానికి సమీపంలో 3.5 నాటికల్ మైళ్ల దూరంలో ప్రయాణిస్తుండగా, సుమారు ఎనిమిది మంది పైరేట్లు ఒక్కసారిగా దాడి చేసి నౌకను తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. అనంతరం నౌకను నుగాల్ తీరం వైపు మళ్లించినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. ఈ అపహరణకు గురైన నౌకలో మొత్తం 10 మంది సిబ్బంది ఉండగా, వారిలో ఏకంగా ఆరుగురు భారతీయ పౌరులే కావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మిగిలిన వారిలో ఒకరు టర్కీకి చెందినవారు, ఒకరు జార్జియా పౌరుడు కాగా, ఇద్దరు సెర్బియాకు చెందిన సెక్యూరిటీ గార్డులు ఉన్నారు. సోమాలియా రాజధాని మొగదిషులో ఉన్న టర్కీ మిలిటరీ శిక్షణ కేంద్రానికి అవసరమైన అధునాతన ఆయుధాలు, కమ్యూనికేషన్, శాటిలైట్ పరికరాలను ఈ నౌకలో రవాణా చేస్తున్నట్లు సమాచారం. ఈ దాడి వెనుక గతంలో 'ఎం/వీ స్వార్డ్' నౌకను అపహరించిన పైరేట్ల ముఠా ప్రమేయం ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం ఘటన జరిగిన ప్రాంతానికి సమీపంలో టర్కీకి చెందిన విమానాలు, డ్రోన్లు, హెలికాప్టర్లు గస్తీ కాస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. ఈ క్రమంలోనే పైరేట్లకు ఆహార సామగ్రిని అందించడానికి వచ్చిన ఒక చిన్న పడవపై వైమానిక దాడి జరిగి నలుగురు మృతి చెందినట్లు వార్తలు వచ్చినప్పటికీ, ఆ దాడి ఎవరు చేశారనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం నౌకలో ఉన్న ఆరుగురు భారతీయులతో సహా సిబ్బంది అందరి భద్రతపై ఆందోళన నెలకొనడంతో, విదేశాంగ శాఖ వర్గాలు ఈ అంశాన్ని నిశితంగా పరిశీలిస్తున్నాయి.

## మయన్మార్ బౌద్ధ ఆశ్రమంపై దాడి

**14 మంది మృతి.. 20 మందికి గాయాలు**

సగయింగ్: మయన్మార్‌లో మరో ఘోరం చోటుచేసుకుంది. సెంట్రల్ సగయింగ్ ప్రాంతంలోని ఒక బౌద్ధ ఆశ్రమంపై సైనిక ప్రభుత్వం జరిపిన వైమానిక దాడిలో 14 మంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఆశ్రమంలో ధ్యాన కార్యక్రమం జరుగుతున్న సమయంలో ఈ దాడి జరగడం పెను విషాదాన్ని నింపింది. మ్యాంగ్ టౌన్‌షిప్‌లోని స్వెల్ లే ఓ గ్రామంలో ఉన్న బౌద్ధ ఆశ్రమంలో వారం రోజుల పాటు ధ్యాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో ప్రజలంతా ధ్యానంలో నిమగ్నమై ఉండగా, సైనిక యుద్ధ విమానం ఆశ్రమ ప్రాంగణంలో బాంబు దాడికి పాల్పడింది. ఈ దాడిలో ముగ్గురు మహిళలతో సహా 14 మంది అక్కడికక్కడే మృతి చెందగా, మరో 20 మందికి పైగా గాయపడ్డారని మ్యాంగ్ టౌన్‌షిప్ సివిల్ డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ ఆర్గనైజేషన్ ప్రతినిధి వెల్లడించారు. మాండలే నగరానికి పశ్చిమాన సుమారు 75 కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం ఉంది. మయన్మార్‌లో సైనిక ప్రభుత్వం, ప్రజాస్వామ్య అనుకూల శక్తులు, స్థానిక సాయుధ వర్గాల మధ్య నిరంతరం ఘర్షణలు జరుగుతున్నాయి. ముఖ్యంగా సగయింగ్ ప్రాంతంలో ఇరు పక్షాల మధ్య పోరు తీవ్రస్థాయిలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సైన్యం జరుపుతున్న వైమానిక దాడుల వల్ల సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి.

## విజయవాడ దుర్గ గుడిలో 7 అంతస్తుల పార్కింగ్

విజయవాడ, ఆగస్టు 21 (ఈవార్తలు): విజయవాడ కనకదుర్గమ్మ దర్శనం కోసం వెళ్లే భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. దుర్గ గుడి వద్ద ట్రాఫిక్ సమస్యలు తొలగించేందుకు, వసతి సదుపాయాలు మెరుగుపరిచేందుకు సరికొత్త ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ విషయాన్ని ఏపీ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. భక్తుల రద్దీ, ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు.. కుమ్మరిపాలెం నుంచి 700 మీటర్ల మేరకు రెండో ఘాట్ రోడ్డు నిర్మాణానికై ఆలోచన చేస్తున్నట్లు మంత్రి వివరించారు. రెండో ఘాట్ రోడ్డు నిర్మాణం సాధ్యాసాధ్యాల నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అలాగే కుమ్మరిపాలెంలోని మూడు ఎకరాల టీటీడీ స్థలంలో 15 వేల మంది భక్తులకు ఉపయోగపడేలా .. ఏడు అంతస్తుల మల్టీ లెవెల్ పార్కింగ్, వసతి సముదాయం నిర్మించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ఆనం వెల్లడించారు. దుర్గాఘాట్ వద్ద భారీ కేశఖండనశాల, ఘాట్ రోడ్డు మొదటి మలుపు వద్ద 25 అడుగుల ఎత్తైన ఆదిశంకరాచార్యుల విగ్రహం ఏర్పాటు చేయడానికి కూడా ప్రణాళికలు రచిస్తున్నట్లు వివరించారు. అలాగే త్వరలోనే అత్యాధునిక మెకనైజ్డ్ కిచెన్లను అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. మరోవైపు ఇంద్రకీలాద్రిపై రూ. 52.50 కోట్లు ఖర్చుచేసి నూతనంగా నిర్మించిన భవనాలను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. రూ. 26 కోట్ల వ్యయంతో నిర్మించిన శ్రీ కనకదుర్గ అన్నప్రసాద భవనం, రూ. 26.50 కోట్ల వ్యయంతో నిర్మించిన శ్రీ దుర్గా భవాని మహా ప్రసాద భవనాలను విజయవాడ ఎంపీ కేశినేని చిన్నితో కలిసి ప్రారంభించారు. అనంతరం నూతన అన్నప్రసాద సదనంలో భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు, ప్రసాద విక్రయ కేంద్రంలో నగదు చెల్లించి అమ్మవారి లడ్డూ ప్రసాదాలను స్వీకరించారు.

## చక్కెర చిక్కులకు ఇథనాల్ కారణం కాదు: కేంద్రం

న్యూఢిల్లీ: దేశంలో చక్కెర ధరలు పెరగడానికి ఇథనాల్ ఉత్పత్తి కోసం చక్కెరను మళ్లించడమే కారణమంటూ వస్తున్న ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. ఈ వాదనల్లో ఏమాత్రం వాస్తవం లేదని, ధరల పెరుగుదల వెనుక ఇతర కారణాలు ఉన్నాయని స్పష్టం చేసింది. ప్రతిపక్షాల నుంచి వస్తున్న విమర్శల నేపథ్యంలో కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ ఈ అంశంపై వివరణ ఇచ్చింది. దేశీయంగా చక్కెర ఉత్పత్తి అంచనాల కంటే తగ్గడం, పండుగల సీజన్ కారణంగా డిమాండ్ పెరగడం, పంట నష్టాలు, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో తలెత్తిన అవాంతరాలే ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలని ప్రభుత్వం తెలిపింది. కొందరు వ్యాపారులు అక్రమంగా నిల్వలు చేయడం కూడా దీనికి దోహదం చేసిందని పేర్కొంది. గత నెల రోజుల్లోనే చక్కెర ధర గణనీయంగా పెరిగింది. జూలై 20న కిలో రూ. 48గా ఉన్న ధర, ఆగస్టు 20 నాటికి రూ. 55 మార్కును దాటింది. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో హోల్ సేల్ మార్కెట్‌లో ధర రూ. 65 దాటగా, రిటైల్ మార్కెట్లో రూ. 70 మార్కును కూడా అధిగమించింది. అయితే, ఈ ధరల పెరుగుదలకు ఇథనాల్ ఉత్పత్తికి ఎటువంటి సంబంధం లేదని కేంద్రం వెల్లడించింది. ఇథనాల్ తయారీ కోసం చక్కెర మళ్లింపు గతంతో పోలిస్తే తగ్గిందని గణాంకాలతో సహా వివరించింది. 2022-23లో 12 శాతం చక్కెరను ఇథనాల్ కోసం మళ్లించగా, 2025-26 నాటికి అది 9 శాతానికే పరిమితమైందని తెలిపింది. దేశంలో ఉత్పత్తి అవుతున్న ఇథనాల్‌లో దాదాపు మూడో వంతు మొక్కజొన్న వంటి ధాన్యాల నుంచే వస్తోందని స్పష్టం చేసింది. ధరలను అదుపు చేసేందుకు ఇప్పటికే తగిన చర్యలు ప్రారంభించామని, చక్కెర నిల్వలపై పరిమితులు విధించామని ప్రభుత్వం పేర్కొంది. అంతేకాకుండా, దేశీయ సరఫరాను పెంచేందుకు సుంకాలు లేని లేదా అతి తక్కువ సుంకంతో కూడిన దిగుమతులకు అనుమతులు మంజూరు చేసినట్లు వెల్లడించింది.

## పని.. ప్రాథమిక హక్కు అవుతుందా?

**కనీస వేతనాలపై విచారణ సందర్భంగా సుప్రీం ప్రశ్న**

న్యూఢిల్లీ: గ్రామీణ కార్మికులకు చట్టబద్ధంగా కల్పించిన ఉపాధి హామీని రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద పేర్కొన్న జీవించే హక్కుతో సమానంగా చూడగలమా అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. పని హక్కును రాజ్యాంగం ప్రాథమిక హక్కుగా గుర్తించలేదని, దీనిని ఆదేశిక సూత్రాల పరిధిలోని బాధ్యతగా మాత్రమే చేర్చిందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించడంతో పాటు వేతనాల చెల్లింపులో జరిగే జాప్యానికి పరిహారం ఇప్పించేలా ఆదేశాలివ్వాలంటూ అరుణా రాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం ధర్మాసనం విచారణ చేపట్టింది. రాజ్యాంగం పని హక్కును ప్రాథమిక హక్కుగా చేయలేదని, ఇది కేవలం నాలుగో భాగంలో ఉన్న ప్రజాస్వామ్య ఆకాంక్ష మాత్రమేనని జస్టిస్ బాగ్చీ విచారణ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ ఆకాంక్షను నెరవేర్చేందుకు ప్రభుత్వం ఒక విధానాన్ని రూపొందించి, దానికి అనుగుణంగా వేతనాలు ఇస్తుందని పేర్కొన్నారు. దీనిని ఆర్టికల్ 21తో సమానంగా చూడలేమన్నారు. ఒకవేళ పని హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తిస్తే, భవిష్యత్తులో ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను తగ్గించుకున్నప్పుడు పలానా పథకాన్ని అమలు చేయాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయగలదా అనే అతిపెద్ద ప్రశ్న ఉత్పన్నమవుతుందని ఆయన పేర్కొన్నారు.

## గ్రామీణ భారత్‌కు స్టార్‌లింక్ మేలు: మస్క్

న్యూయార్క్: భారత్‌లో ఇంటర్నెట్ సదుపాయం అంతగా లేని ప్రాంతాలకు స్టార్‌లింక్ ఉపయోగపడుతుందని స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ అన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు శాటిలైట్ ఇంటర్నెట్ మేలు చేస్తుందని పేర్కొన్నారు. భారత్‌లో స్టార్‌లింక్ వాణిజ్య సేవలు ఇంకా ప్రారంభం కాలేదు. అనుమతుల ప్రక్రియ కొనసాగుతోంది. 'ఎక్స్'లో ఓ పోస్ట్‌కు స్పందిస్తూ మస్క్ ఈ వ్యాఖ్యలు చేశారు. 2026 మే నాటికి దేశంలో 11,256 గ్రామాలకు 4జీ సదుపాయం లేదని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఇంటర్నెట్ వినియోగంలో భారీ తేడా ఉందని వివరించారు. 2026 మార్చి నాటికి భారత్‌లో 109.3 కోట్ల ఇంటర్నెట్ సబ్‌స్క్రిప్షన్లు ఉన్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల వాటా 44.087 కోట్లు. గ్రామీణ ప్రాంతాల్లో 100 మందికి 48.31 ఇంటర్నెట్ కనెక్షన్లు ఉన్నాయి. పట్టణాల్లో ఈ సంఖ్య 126.80గా ఉంది. మారుమూల గ్రామాలు, పర్వత ప్రాంతాలు, దీవులు, విపత్తుల ప్రభావిత ప్రాంతాల్లో శాటిలైట్ ఇంటర్నెట్ ఉపయోగపడే అవకాశం ఉంది. ఇలాంటి చోట్ల భౌగోళిక పరిస్థితులు, మౌలిక వసతుల కొరత వల్ల సంప్రదాయ టెలికాం సేవలు అందించడం కష్టంగా ఉంటుంది. దేశంలో భారత్‌నెట్ ద్వారా 8.5 లక్షల రూట్ కిలోమీటర్లకు పైగా ఫైబర్ వేశారు. సుమారు 2.21 లక్షల గ్రామ పంచాయతీలను సేవలకు సిద్ధం చేశారు. స్టార్‌లింక్ సేవలు ప్రారంభం కావాలంటే నియంత్రణ అనుమతులు, స్పెక్ట్రమ్ కేటాయింపు పూర్తి కావాలి. ఈ ప్రక్రియ పూర్తయితే మారుమూల ప్రాంతాల్లో హైస్పీడ్ ఇంటర్నెట్ అందుబాటులో వచ్చే అవకాశం ఉంది.

## లవ్లీ చిత్రం


నేహా మాలిక్



తెలుగు, తమిళ సినీ పరిశ్రమల్లో తనదైన ముద్ర వేసిన దిగ్గజ నటి షావుకారు జానకి (94) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో ఇటీవలే ఆమె చెన్నైలోని కావేరీ ఆసుపత్రిలో చేరారు. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచినట్లు నటీనటుల సంఘం అధ్యక్షుడు నాజర్ ప్రకటించారు. రాజమహేంద్రవరానికి చెందిన శంకరమంచి జానకి, సినీ రంగంలో 'షావుకారు జానకి'గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.





దిగ్గజ నటి

# షావుకారు జానకి కన్నుమూత

1950లో ఎల్వీ ప్రసాద్ దర్శకత్వం వహించిన తెలుగు చిత్రం 'షావుకారు'తో ఆమె వెండితెర అరంగేట్రం చేశారు. ఆ సినిమా విజయం తర్వాతే ఆమె పేరుకు ముందు 'షావుకారు' చేరింది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఆమె సుదీర్ఘ సినీ ప్రయాణం సాగింది. విభిన్న పాత్రలతో ప్రేక్షకులను మెప్పించారు. వెండితెరతో పాటు బుల్లితెరపైనా నటించారు. ఇటీవల కూడా తెలుగు సినిమాల్లో కనిపించారు. ఆమె చివరిసారిగా 2023లో విడుదలైన 'అన్నీ మంచి శకునములే' చిత్రంలో నటించారు. మొత్తంగా షావుకారు జానకి 450కు పైగా సినిమాల్లో నటించారు. నాలుగు తరాల నటీనటులతో కలిసి పనిచేసిన ఘనత ఆమె సొంతం. ఎంజీఆర్, జయలలిత, ఎన్‌టీఆర్, ఏఎన్ఆర్, శివాజీ గణేశన్, రాజ్‌కుమార్ వంటి దిగ్గజాలతో స్క్రీన్ చేసుకున్న నటిగా ఆమె రికార్డు సృష్టించారు. సినీ రంగానికి చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం 2022లో ఆమెకు పద్మశ్రీ పురస్కారం అందించింది. దశాబ్దాల పాటు సాగిన ఆమె నటనా ప్రస్థానం తెలుగు సినీ చరిత్రలో ప్రత్యేక అధ్యాయంగా నిలిచిపోతుంది. షావుకారు జానకి అంత్యక్రియలు శనివారం మధ్యాహ్నం చెన్నైలోని బెసెంట్ నగర్ శ్మశానవాటికలో జరగనున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. శనివారం ఉదయం నుంచి అభిమానులు, ప్రజల సందర్శనార్థం ఆమె భౌతికకాయాన్ని నివాసంలో ఉంచి, మధ్యాహ్నం అనంతరం అంతిమ సంస్కారాలను పూర్తి చేయనున్నారు.





## అంతా సెటిలైపోయింది: ఈశ్వర్ సాయి భార్య

ప్రముఖ జానపద గాయకుడు, 'బాసింగా బలాలు' ఫేమ్ ఈశ్వర్ సాయి వ్యక్తిగత జీవితానికి సంబంధించి సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి ఆయన భార్య శరణ్య చెక్ పెట్టింది. విడాకుల వార్తలు, గొడవలపై ఆమె స్పందిస్తూ కీలక ప్రకటన చేసింది. మీ భర్త చేసిన పనికి విడాకులు ఇస్తున్నారా.. అని ఒక ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నకు శరణ్య మాట్లాడుతూ.. విడాకులు ఎందుకు ఇవ్వాలి? నా భర్తను నేను వదులుకోను. ఇరువర్గాలు కూర్చుని మాట్లాడుకుని అన్నీ సెటిల్ చేసుకున్నాం. మా మధ్య ఎలాంటి గొడవలు లేవు. ఇక మా గురించి అనవసరంగా మాట్లాడటం ఆపండి అని ఫోక్ సింగర్ ఈశ్వర్ సాయి భార్య శరణ్య తేల్చిచెప్పారు. తమకు పెళ్లై ఏడేళ్లు అవుతోందని, ఆయన చాలా మంచివారని, అసలు తప్పు ఆయన వైపు లేదని ఆమె స్పష్టం చేశారు. ఇటీవల వేములవాడ ఘటన తర్వాత కొద్దిగా ఉద్రిక్తత చోటుచేసుకున్నప్పటికీ, ఇప్పుడు అన్ని విషయాలు సర్దుమణిగాయని తెలిపారు.



## జైలర్ 2 ఫస్ట్ సింగిల్ రిలీజ్

సూపర్‌స్టార్ రజినీకాంత్ హీరోగా, నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జైలర్ 2' కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా, చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ఈ సినిమా నుంచి తొలి పాట 'అల బొలెలో'ను శుక్రవారం విడుదల చేసి అభిమానులకు పండగలాంటి వార్త చెప్పింది. యువ సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ స్వరపరిచిన ఈ ఫుట్ ట్యాపింగ్ నంబర్‌ను ఆయనే స్వయంగా ఆలపించడం విశేషం. దర్శకుడు అరుణ్‌రాజా కామరాజ్ దీనికి సాహిత్యం అందించారు. అయితే, ఈ పాటలో సంగీతం, సాహిత్యం కంటే ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ సమకూర్చిన స్టెప్పులు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి.  హావభావాలతో ఎంతగానో ఆకట్టుకున్నారు. ఆమె డ్యాన్స్ పాటకు ప్రత్యేక కళను తెచ్చిపెట్టింది.



## అదనపు స్క్రీన్లు, షోలు

మాస్ మహారాజా రవితేజ నటించిన తాజా చిత్రం 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తుండటంతో, తెలుగు రాష్ట్రాల్లో అదనపు షోలను, మరిన్ని థియేటర్లను జోడిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. సినిమాకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు మేకర్స్ తెలిపారు. ప్రముఖ దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటూ మంచి వసూళ్లను సాధిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కొత్త థియేటర్లను జోడించడంతో పాటు, ఉన్న థియేటర్లలోనూ అదనపు ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు చిత్ర యూనిట్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. 'రవన్న బాక్సాఫీస్ దండయాత్ర' కొనసాగుతోందని చిత్రబృందం ప్రచార చిత్రాల ద్వారా పేర్కొంటోంది. ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం అదనపు ఆకర్షణగా నిలిచింది. టీ-సిరీస్ ఫిలిమ్స్ సమర్పణలో విడుదలైన 'ఇరుముడి', రవితేజ అభిమానులను, మాస్ సినీ ప్రియులను అలరిస్తూ థియేటర్లలో విజయవంతంగా తన ప్రదర్శనను కొనసాగిస్తోంది.

## దక్షిణాఫ్రికా మోడల్‌ను పెళ్లాడిన అర్జున్ రాంపాల్

బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ పెళ్లి చేసుకున్నాడు. దక్షిణాఫ్రికా మోడల్ గాబ్రియెల్లా డెమెట్రియాడ్స్‌తో ఎనిమిదేళ్లుగా సహజీవనం చేస్తున్న అర్జున్.. ఎట్టకేలకు తమ బంధాన్ని శాశ్వతంగా మార్చేసుకున్నాడు. శుక్రవారం ఏమాత్రం హడావిడి లేకుండా గోవాలోని రిజిస్టర్ ఆఫీసులో వివాహ బంధంలోకి అడుగుపెట్టిందీ జంట. దాంతో.. వీరికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. సహజీవనంలో ఉంటూ పిల్లల్ని కనడం.. ఆపై పెళ్లి చేసుకోవడం ఈమధ్య మామూలైంది. ఇటీవలే ఫుట్‌బాలర్ క్రిస్టియానో రొనాల్డో తన ప్రేయసి, భాగస్వామిని మనువాడగా.. ఇద్దరు పిల్లల తండ్రైన బాలీవుడ్ స్టార్ అర్జున్ రాంపాల్ ఎట్టకేలకు పెళ్లి చేసుకున్నాడు.





## హిందూ-ముస్లిం మైండ్‌సెట్ వీడండి

వందేమాతరం అంశంపై బాలీవుడ్ సీనియర్ నటి షర్మిలా టాగూర్ చేసిన వ్యాఖ్యలపై బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్ తీవ్రంగా స్పందించారు. 'వందేమాతరం' గేయాన్ని కేవలం మొదటి రెండు చరణాలకే పరిమితం చేయాలనే షర్మిలా టాగూర్ సూచనను ఆమె తప్పుపట్టారు. ఈ సందర్భంగా హిందూ-ముస్లిం మైండ్‌సెట్ నుంచి ప్రతి ఒక్కరూ బయటకు రావాలని కంగనా హితవు పలికారు. కళను, సాహిత్యాన్ని మతపరమైన కోణంలో మాత్రమే చూడటం సరికాదని ఆమె అభిప్రాయపడ్డారు.



## స్పిరిట్‌లో 10% లాభం డిమాండ్!

ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న స్పిరిట్ సినిమా నుంచి దీపికా తప్పుకోవడం ఇప్పటికే పెద్ద చర్చకు దారితీసింది. తాజాగా ఈ వివాదంపై సందీప్ రెడ్డి వంగా సోదరుడు ప్రణయ్ రెడ్డి వంగా చేసిన వ్యాఖ్యలు మరింత సంచలనంగా మారాయి. దీపిక రెమ్యునరేషన్, పని గంటలతో పాటు సినిమా లాభాల్లో వాటా కూడా అడిగారని ఆయన ఆరోపించారు. ప్రణయ్ రెడ్డి వంగా మాట్లాడుతూ.. దీపికా పదుకొణె సినిమా లాభాల్లో 10 శాతం వాటా కోరారని చెప్పారు. ఆమె ఏదైనా డిమాండ్ చేయవచ్చని, అయితే సినిమా బడ్జెట్‌కు ఆ డిమాండ్ సరిపోవాలని అన్నారు. ఆర్థికంగా లెక్కలు సరిపోకపోవడంతో ఇతర ఆప్షన్ల కోసం వెతికామని తెలిపారు. దీపికతో సందీప్ సుమారు 18 నెలల పాటు మాట్లాడారని ప్రణయ్ తెలిపారు.

# త్రిసా, గాయత్రి సంచలనం

బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత అమ్మాయిలు పతకం ఖరారు చేశారు. మహిళల డబుల్స్‌లో సంచలన ఆటతో దూసుకెళ్తున్న గాయత్రి గోపిచంద్, త్రీసా జాలీ ద్వయం 15 ఏళ్ల నిరీక్షణకు తెరదించింది. 16వ రౌండ్‌లో ఏడో సీడ్‌కు షాకిచ్చిన ఈ ద్వయం.. ఈసారి 32 వ రౌండ్‌లో నాలుగో సీడ్‌పై సంచలన విజయం సాధించింది. క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టడం ద్వారా దేశానికి చరిత్రాత్మక పతకం అందించనుందీ జంట.



బ్యాడ్మింటన్ వరల్డ్‌కప్‌లో భారత అమ్మాయిలు చరిత్రాత్మక పతకం అందించారు. పీవీ సింధు విఫలమైనా మేమున్నాం అని చాటుతూ.. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపిచంద్, త్రిసా జాలీలు 15 ఏళ్ల కరువు తీర్చారు. 16వ రౌండ్‌లో ఏడో సీడ్‌ను ఇంటికి పంపిన ఈ జంట.. శుక్రవారం నాలుగో సీడ్ జియా యీ ఫాన్ -- ఘూంగ్ షు గ్జియాన్(చైనా)ను చిత్తు చేసింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో తొలి సెట్‌ను 16-21తో కోల్పోయినా ఒత్తిడికి లోనవ్వని భారత ద్వయం రెండో సెట్‌ను 21-15తో గెలుచుకుంది. నిర్ణయాత్మక మూడో సెట్‌లోనూ చైనా జోడీకి చెక్ పెడుతూ 21-13తో మ్యాచ్‌ను ముగించింది గాయత్రి, త్రిసా జంట. తద్వారా.. అశ్విని పొన్నప్ప, గుత్తా జ్వాల అనంతరం.. మహిళల డబుల్స్‌లో పతకం ఖాయం చేసిన రెండో జంటగా వీరు రికార్డు నెలకొల్పారు. 2011లో జ్వాల, అశ్విని కాంస్యం సాధించారు.

## ఇంగ్లండ్ చేతిలో పాక్ చిత్తు

పాకిస్తాన్‌తో మూడు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లండ్ శుభారంభం చేసింది. లీడ్స్ వేదికగా జరిగిన తొలి టెస్టులో పాక్‌ను ఇన్నింగ్స్ 103 పరుగుల తేడాతో ఇంగ్లండ్ చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో పర్యాటక జట్టు బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ విఫలమైంది. సల్మాన్ అఘా సారథ్యంలోని పాక్ తమ తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ బౌలర్ల ధాటికి 171 పరుగులకే కుప్పకూలింది. ఇంగ్లండ్ పేసర్లు ఓలీ రాబిన్సన్, జోష్ టంగ్ తలా ఐదేసి వికెట్లు పడగొట్టి పాక్ జట్టును దెబ్బ తీశారు. పాక్ ఇన్నింగ్స్‌లో అబ్దుల్లా షఫీక్ (61), ఇమామ్-ఉల్-హక్ (42) మినహా మిగితా బ్యాటర్లంతా దారుణంగా విఫలమయ్యారు. అనంతరం ఇంగ్లండ్ తమ తొలి



ఇన్నింగ్స్‌లో 409 పరుగుల భారీ స్కోర్ సాధించింది. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో 238 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. కెప్టెన్ జోరూట్(66), హ్యారీ బ్రూక్(91), లారెన్స్(51), కాక్స్(73) హాఫ్ సెంచరీలతో సత్తాచాటారు. పాక్ బౌలర్లలో స్పిన్నర్ అలీ ఉస్మాన్ ఐదు వికెట్లు పడగొట్టాడు. ఆ తర్వాత 238 పరుగుల వెనకంజతో రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన పాక్ జట్టు.. కేవలం 135 పరుగులకే ఆలౌటైంది. పేస్ బౌలర్లు ఓలీ రాబిన్సన్, జోష్ టంగ్, జోఫ్రా ఆర్చర్ తలా మూడు వికెట్లు పడగొట్టి పాక్ పతనాన్ని శాసించారు. ఈ విజయంతో ఇంగ్లండ్ మూడు టెస్టు సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఇరు జట్ల మధ్య రెండో టెస్టు లండన్ వేదికగా ఆగస్టు 27 నుంచి ప్రారంభం కానుంది.

### జో రూట్ ప్రపంచ రికార్డు

ఇంగ్లండ్ టెస్టు కెప్టెన్ జో రూట్ మరో అరుదైన ఘనతను తన పేరిట లిఖించుకున్నాడు. టెస్టు క్రికెట్‌లో అత్యధిక క్యాచ్‌లు పట్టిన ఫీల్డర్‌గా రూట్ వరల్డ్ రికార్డు సృష్టించాడు. లీడ్స్ వేదికగా పాకిస్తాన్‌తో జరిగిన తొలి టెస్టు మూడో రోజు ఆటలో రూట్ ఈ చారిత్రక ఘనతను సాధించాడు. జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో ఓపెనర్ అజాన్ అవాయిస్ ఇచ్చిన క్యాచ్‌ను అందుకోవడంతో రూట్ ఈ రేర్ ఫీట్‌ను నమోదు చేశాడు. ఈ లెజెండరీ బ్యాటర్ ఇప్పటివరకు 219 టెస్టు క్యాచ్‌లను అందుకున్నాడు. ఇంతకుముందు ఈ రికార్డు ఆసీస్ స్టార్ స్టీవ్ స్మిత్ (218 క్యాచ్‌లు) పేరిట ఉండేది. తాజా క్యాచ్‌తో స్మిత్ ఆల్‌టైమ్ రికార్డును రూట్ బ్రేక్ చేశాడు.

## ముగిసిన సాత్విక్ జోడీ పోరాటం

బీడబ్ల్యూఎఫ్ ఛాంపియన్‌షిప్స్ డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి పోరాటం ముగిసింది. కచ్చితంగా పతకం గెలుస్తారనుకున్న ఈ ద్వయం క్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో వరల్డ్ నంబర్ 3 లియాంగ్ వీ కెంగ్ - వాంగ్ చాంగ్ ధాటికి భారత జోడీ చేతులెత్తేసింది. దాంతో, మూడోసారి ఈ టోర్నమెంట్‌లో పతకంతో మురవాలనుకున్న సాత్విక్ - చిరాగ్ ఆశలు ఆవిరయ్యాయి. నెదర్లాండ్స్ వేదికగా జరుగుతున్న బీడబ్ల్యూఎఫ్ ఛాంపియన్‌షిప్స్‌లో శుక్రవారం భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపిచంద్ - త్రిసా జాలీ ద్వయం క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లగా.. పురుషుల జంట మాత్రం నిరాశపరిచింది. ఈ ఛాంపియన్‌షిప్స్‌లో ఇది వరకు రెండుసార్లు మెడల్ కొల్లగొట్టిన సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి జోడీ క్వార్టర్స్ దాటలేదు. మూడో సీడ్ లియాంగ్ వీ కెంగ్ - వాంగ్ చాంగ్‌తో పోరులో తేలిపోయిన భారత జంట 18-21, 9-21తో చిత్తుగా ఓడింది. తొలి సెట్‌లో కాస్త పోరాడినా.. రెండో సెట్‌లో ప్రత్యర్థికి బదులివ్వలేక మ్యాచ్‌ను అప్పగించేసింది సాత్విక్ చిరాగ్ ద్వయం. 2022, 2025లో చెలరేగి ఆడిన ఈ జోడీ కాంస్యం గెలుపొందిన విషయం తెలిసిందే.



## టీమిండియాకు ప్రత్యేక విందు

శ్రీలంక పర్యటనలో ఉన్న భారత క్రికెట్ జట్టుకు కొలంబోలో ఘనమైన ఆతిథ్యం లభించింది. పర్యటనలో భాగంగా శ్రీలంకతో జరుగుతున్న రెండు టెస్టుల సిరీస్‌లో రెండో మ్యాచ్‌కు ముందు, శ్రీలంకలోని భారత హైకమిషనర్ సంతోష్ ఝా ఇరు దేశాల జట్లకు విందు ఏర్పాటు చేశారు. కొలంబోలోని ఇండియా హౌస్‌లో నిన్న రాత్రి ఈ కార్యక్రమం జరిగింది. రెండో టెస్టుకు సన్నద్ధమవుతున్న భారత, శ్రీలంక ఆటగాళ్లు ఈ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం గురించి బీసీసీఐ తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేసింది. "కొలంబోలో ఇదొక చిరస్మరణీయ సాయంత్రం! రెండో టెస్టుకు ముందు శ్రీలంకలో భారత హైకమిషనర్ సంతోష్ ఝా,



టీమిండియాకు ఇండియా హౌస్‌లో ఆతిథ్యం ఇచ్చారు" అని పేర్కొంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను కూడా పంచుకుంది. భారత హైకమిషనర్ సంతోష్ ఝా కూడా ఈ కార్యక్రమంపై హర్షం వ్యక్తం చేశారు. "టీమిండియాకు మా మద్దతు ఎప్పుడూ ఉంటుంది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా శ్రీలంకలో పర్యటిస్తున్న టీమిండియా, శ్రీలంక జట్లకు ఆతిథ్యం ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. ఇరు దేశాలను కలిపి ఉంచే క్రికెట్, భారత్-శ్రీలంక మధ్య ఉన్న చిరకాల బంధాన్ని మరింత బలోపేతం చేస్తూనే ఉంది" అని ఆయన తన 'ఎక్స్' పోస్టులో తెలిపారు. ప్రస్తుతం రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో ఉంది. గాలే వేదికగా జరిగిన తొలి టెస్టులో శ్రీలంకపై 165 పరుగుల భారీ తేడాతో టీమిండియా ఘన విజయం సాధించింది. ఇక, ఇరు జట్ల మధ్య రెండో టెస్టు మ్యాచ్ ఈ నెల 23 నుంచి 27 వరకు కొలంబోలో జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను సమం చేయాలని శ్రీలంక పట్టుదలతో ఉండగా, విజయాన్ని కొనసాగించి సిరీస్ కైవసం చేసుకోవాలని, తద్వారా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో తమ స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకోవాలని భారత్ చూస్తోంది.



## నెట్స్‌లో బిజీ

### టీమిండియా తీవ్ర కసరత్తు

### రేపటి నుంచి రెండో టెస్టు

గాలే టెస్టులో విజయంతో జోరుమీదున్న భారత జట్టు సిరీస్ లక్ష్యంగా పెట్టుకుంది. కొలంబోలో ఆగస్టు 23 నుంచి మొదలయ్యే రెండు టెస్టుకు పక్కాగా సిద్ధమవుతోంది టీమిండియా. శ్రీలంక స్పిన్నర్లను ధీటుగా ఎదుర్కొనేందుకు భారత ఆటగాళ్లు నెట్స్‌లో సాధన చేశారు. ముఖ్యంగా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఎడమ చేతివాటం స్పిన్నర్ల బంతులను ఎదుర్కొన్నాడు. కొలంబో టెస్టుకు మరొక్క రోజే ఉంది. తొలి పోరులో 165 పరుగులతో గెలుపొందిన భారత జట్టు.. ఇక్కడా విజయమే లక్ష్యంగా ఆడనుంది. అయితే.. దెబ్బతిన్న సింహంలా ఉన్న లంకను మరోసారి నిలువరించేందుకు వ్యూహాత్మకంగా సిద్ధమవుతోంది టీమిండియా. గాలేలో రెండు ఇన్నింగ్స్‌ల్లో 16, 8 పరుగులతో విఫలమైన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ప్రధానంగా స్పిన్నర్లతో బౌలింగ్ చేయించుకున్నాడు. లంక స్పిన్నర్ ప్రభాత జయసూర్య ఓవర్లో రెండుసార్లు ఔటైన గిల్.. శుక్రవారం నెట్స్‌లో స్పిన్నర్లను ఆడుతూ కొలంబో టెస్టు ముందు ఆత్మవిశ్వాసం పెంచుకున్నాడు. అయితే.. ఓపెనర్ కేఎల్ రాహుల్, మణికట్టు మాంత్రికుడు కుల్దీప్ యాదవ్ మాత్రం నెట్స్ సెషన్‌లో కనిపించలేదు. దాంతో.. కొలంబో టెస్టుకు కుల్దీప్‌ను నిజంగానే పక్కన పెట్టేస్తారా?.. సరాన్ష్ జైన్‌కు డెబ్యూట్ క్యాప్ అందిస్తారా? అనేది ఉత్కంఠ రేపుతోంది.





నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

# విద్యార్థుల కన్నీళ్లు.. నిరుద్యోగుల ఎదురుచూపులు!

తెలంగాణలో విద్యార్థి, నిరుద్యోగ యువత సమస్య మళ్లీ తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తున్న యువత రోడ్లపైకి వస్తోంది. విశ్వవిద్యాలయాల్లో ఆందోళనలు జరుగుతున్నాయి. గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి సిద్ధమవుతున్న అభ్యర్థులకు ప్రతి ఆలస్యం ఒక సంవత్సరం కాదు.. వారి జీవితంలో విలువైన కాలాన్ని కోల్పోవడమే. జూన్, జూలై 2026లోనూ ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో నిరుద్యోగ యువత ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఆందోళనలు నిర్వహించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు యువతలో భారీ ఆశలు ఉన్నాయి. ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ సమస్య పరిష్కారం వంటి హామీలు యువతను ఆకర్షించాయి. కానీ రెండేళ్లు దాటుతున్నా ఉద్యోగ నియామకాలపై అసంతృప్తి కొనసాగుతోంది. 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు, నిరుద్యోగ భృతి అంశాలపై స్పష్టత లేకపోవడంపై కూడా యువతలో విమర్శలు వచ్చాయి. ప్రభుత్వం పూర్తిగా ఏమీ చేయలేదని చెప్పడం వాస్తవాన్ని అతిశయోక్తి చేయడమే. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2026లో పలు విభాగాలకు నియామక నోటిఫికేషన్లు జారీ చేసింది. అయితే సమస్య కొన్ని నోటిఫికేషన్లు వచ్చాయా లేదా అన్నది కాదు.. యువత ఆశించిన స్థాయిలో, ముందుగా ప్రకటించిన కాలపట్టిక ప్రకారం నియామక ప్రక్రియ సాగుతోందా అన్నదే. ఉద్యోగం కోసం సిద్ధమవుతున్న ఒక యువకుడి జీవితాన్ని ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. ఒక నోటిఫికేషన్ కోసం అతను ఏడాది చదువుతాడు. కోచింగ్‌కు డబ్బులు ఖర్చు చేస్తాడు. గదికి అద్దె చెల్లిస్తాడు. పుస్తకాలు కొనుగోలు చేస్తాడు. కుటుంబం నుంచి డబ్బులు తీసుకుంటాడు. పరీక్ష వాయిదా పడితే మరోసారి అదే ఖర్చు. నోటిఫికేషన్ ఆలస్యమైతే మరో ఏడాది. వయోపరిమితి దాటితే మాత్రం అతని చేతిలో మిగిలేది నిరాశే. అందుకే ఉద్యోగ నియామకాల్లో ఆలస్యం కేవలం పరిపాలనా ఆలస్యం కాదు.. అది యువత జీవితకాలాన్ని ప్రభావితం చేసే నిర్ణయం. ప్రస్తుతం పోలీసు ఉద్యోగాల విషయంలోనూ ఇదే అసంతృప్తి కనిపిస్తోంది. నిరుద్యోగ యువత వేలాది పోలీసు ఖాళీలను భర్తీ చేయాలని, వయోపరిమితిపై సడలింపులు ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. జూన్, జూలైలో హైదరాబాద్‌లో జరిగిన నిరసనల్లో ఈ డిమాండ్లు ప్రధానంగా వినిపించాయి. ఇక్కడ ప్రభుత్వానికి ఒక కీలక ప్రశ్న ఉంది. నియామక ప్రక్రియ ఆలస్యం అయితే వయోపరిమితి దాటిన అభ్యర్థుల పరిస్థితి ఏమిటి? ప్రభుత్వం ఆలస్యం చేసిన సంవత్సరాలను అభ్యర్థుల వయసులోంచి తీసివేయగలదా? తీసివేయలేకపోతే కనీసం ఆ ఆలస్యానికి పరిహారంగా వయోపరిమితి సడలింపు ఇవ్వడం న్యాయమైనదే కదా? ఎన్నో సంవత్సరాలుగా నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ఇది అత్యంత న్యాయమైన డిమాండ్. ఇక విద్యార్థుల పరిస్థితి కూడా ఆందోళనకరమే. చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగం రావడం లేదు. ఉద్యోగం కోసం పోటీ పరీక్షలు రాస్తే నోటిఫికేషన్లు సక్రమంగా రావడం లేదు. ప్రైవేట్ ఉద్యోగాలకు వెళ్తే నైపుణ్యాల లోపం అడ్డంకిగా మారుతోంది. ఒకవైపు డిగ్రీలు పెరుగుతున్నాయి.. మరోవైపు ఉపాధి అవకాశాలు, పరిశ్రమ అవసరాలకు సరిపోయే నైపుణ్యాలు మధ్య అంతరం పెరుగుతోంది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం రాష్ట్రంలో ఇంజనీరింగ్ పట్టభద్రుల ఉద్యోగార్హతపై ఆందోళన వ్యక్తం చేశారు. ఏటా సుమారు 1.10 లక్షల ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు బయటకు వస్తున్నప్పటికీ చాలామందికి ఉద్యోగ దరఖాస్తు కూడా సక్రమంగా రాయలేని పరిస్థితి ఉందని ఆయన వ్యాఖ్యానించారు. అది నిజమైతే.. ప్రశ్న విద్యార్థులపైనే కాదు, ప్రభుత్వంపైనా, విద్యాసంస్థలపైనా పడుతుంది. నాలుగేళ్లు చదివిన విద్యార్థికి ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యం రాకపోతే తప్పు ఎవరిది? కేవలం విద్యార్థినే నిందించడం సరికాదు. కాలేజీల నాణ్యత, అధ్యాపకుల సామర్థ్యం, పరిశ్రమలతో విద్యాసంస్థల అనుసంధానం, నైపుణ్య శిక్షణ, పాఠ్యాంశాల ఆధునికీకరణ.. అన్నింటినీ ప్రశ్నించాలి. రాష్ట్రంలో ప్రతి ఏడాది వేలాది మంది పట్టభద్రులు బయటకు వస్తున్నప్పుడు వారికి ఉద్యోగ మార్కెట్‌లో స్థానం కల్పించేలా ఉన్నత విద్యా విధానాన్ని మార్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. అయితే ప్రభుత్వ ఉద్యోగాలే పరిష్కారం అని భావించడం కూడా ప్రమాదకరం. తెలంగాణ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ రంగంలోనూ లక్షలాది అవకాశాలు రావాలి. ఐటీ, కృత్రిమ మేధ, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, తయారీ, ఆరోగ్యం, పర్యాటకం, లాజిస్టిక్స్, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు వంటి రంగాల్లో భారీగా ఉపాధి సృష్టించే విధానాలు అవసరం.

# కాంగ్రెస్‌లో కుంపటి

**తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బహిరంగ యుద్ధంగా మారుతున్నాయి. మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై చేసిన ఘాటు వ్యాఖ్యలు ఇప్పుడు కుటుంబ వివాదాన్ని దాటి కాంగ్రెస్ పార్టీ అంతర్గత సంక్షోభంగా మారాయి. సుస్మిత వ్యాఖ్యలపై మంత్రి సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నోటీసు ఇవ్వడం, మూడు రోజుల్లో వివరణ కోరడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఇక్కడ అసలు ప్రశ్న సుస్మిత ఎవరి మీద ఏమన్నారు అన్నది మాత్రమే కాదు. పార్టీలోని అసంతృప్తిని బహిరంగంగా వ్యక్తం చేసే హక్కుకు, పార్టీ క్రమశిక్షణకు మధ్య గీత ఎక్కడ? అన్నదే. అధికారంలో ఉన్న పార్టీ నేతలు ముఖ్యమంత్రిపైనే బహిరంగ ఆరోపణలు చేస్తే అది వ్యక్తిగత అభిప్రాయంగా మిగలదు.**



ప్రభుత్వ ప్రతిష్ఠ, పార్టీ ఐక్యత, పాలనా సామర్థ్యంపై ప్రభావం చూపుతుంది. పరకాల సీటు విషయంలో సుస్మిత చేసిన వ్యాఖ్యలు కూడా కాంగ్రెస్‌లో భవిష్యత్ టికెట్ల పోరును ముందుగానే బయటపెట్టాయి. వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని అభ్యర్థిగా కొనసాగిస్తామని రేవంత్‌రెడ్డి చెప్పిన నేపథ్యంలో సుస్మిత తనకే పరకాలపై హక్కు ఉందన్న రీతిలో మాట్లాడటం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అవసరమైతే స్వతంత్రంగా పోటీ చేస్తానన్న సంకేతాలు కూడా పార్టీ నాయకత్వానికి సవాలుగా మారాయి. అయితే ఈ పరిణామాన్ని కేవలం 'కొండా కుటుంబం వర్సెస్ రేవంత్'గా చూడటం కూడా పొరపాటే. కాంగ్రెస్‌లో చాలాకాలంగా పేరుకుపోతున్న అసంతృప్తులు, నియోజకవర్గాల ఆధిపత్య పోటీలు, పదవులు–టికెట్లపై ఆశలు, నాయకత్వంతో దూరం వంటి అంశాలు ఇలాంటి బహిరంగ విభేదాలకు కారణమవుతున్నాయా అన్నదే అధిష్ఠానం ఆలోచించాల్సిన విషయం. ఇప్పటికే కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కొండా సురేఖపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినట్లు వార్తలు వచ్చాయి. దాదాపు 20 మంది ప్రజాప్రతినిధులు ఆమెను సస్పెండ్ చేయాలని కోరినట్లు సమాచారం. ఇక్కడ కాంగ్రెస్ నాయకత్వానికి రెండు సవాళ్లు ఉన్నాయి. ఒకటి క్రమశిక్షణను కాపాడటం. రెండోది అసంతృప్తిని అణచివేయకుండా రాజకీయంగా పరిష్కరించడం. కేవలం షోకాజ్ నోటీసులు, సస్పెన్షన్లు, బర్తరఫ్‌లతో సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకదు. అదే సమయంలో ఎవరైనా పార్టీ వేదిక వెలుపల ముఖ్యమంత్రిని, ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని మాట్లాడితే మౌనం వహించడం కూడా సరైన సంకేతం కాదు. కొండా సురేఖ విషయంలోనూ ఒక విషయం స్పష్టంగా ఉండాలి. కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తల్లి మంత్రి రాజకీయంగా బాధ్యత వహించాలా? లేక వ్యక్తి చేసిన వ్యాఖ్యలకు వ్యక్తినే బాధ్యుడిగా చూడాలా? అనే ప్రశ్నకు కాంగ్రెస్ స్పష్టమైన ప్రమాణాన్ని ఏర్పరచాలి. లేదంటే ఇదే తరహా వివాదాలు రేపు మరిన్ని కుటుంబాలు, మరిన్ని నియోజకవర్గాల్లో పునరావృతమయ్యే అవకాశం ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇంకా పూర్తి కాలం కూడా కాలేదు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని అంతర్గత ఆధిపత్య పోరాటాలకు వినియోగించుకోవడం పార్టీకి రాజకీయంగా ప్రమాదకరం. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేసే విమర్శల కంటే సొంత పార్టీ నేతలే చేసే విమర్శలు ప్రజల్లో ఎక్కువ ప్రభావం చూపుతాయి. పార్టీ అంటే వ్యక్తుల సమూహం కాదు.. ఒక వ్యవస్థ. నాయకత్వం అంటే కేవలం ఆదేశాలు ఇవ్వడం కాదు.. అందరినీ కలుపుకొని నడిపించడం. కొండా సురేఖ--సుస్మిత వ్యవహారం కాంగ్రెస్‌కు ఇదే పాఠాన్ని చెబుతోంది. ఇది కొండా కుటుంబాన్ని శిక్షించే అంశంగా మాత్రమే ముగిస్తే మరో వివాదానికి దారి తీస్తుంది. సమస్యకు మూలం ఏమిటో గుర్తించి, పార్టీలోని అసంతృప్తికి రాజకీయ పరిష్కారం చూపితేనే కాంగ్రెస్ బలపడుతుంది. లేకపోతే బయట ప్రతిపక్షంతో పోరాడాల్సిన పార్టీ.. లోపలే తనతో తానే పోరాడుకునే పరిస్థితి ఏర్పడుతుంది. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ నుంచి కోరుకునేది అంతర్గత కీచులాటలు కాదు.. స్థిరమైన పాలన. ఆ బాధ్యతను పార్టీ నాయకత్వం ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది.

– చిన్నంపాటి సతీశ్ రాజు, వరంగల్



# ప్రజాబంధువు కొత్వాల్ వెంకట రామారెడ్డి

**.....నేడు పాశంవారి వెంకట రామారెడ్డి జయంతి.......**

**పింగళి వెంకట రామారెడ్డి... నేటి తరానికి చెందిన చాలామందికి అంతగా పరిచయం లేని పేరు. కానీ భాగ్యనగరం చరిత్రను తిరగేస్తే ఆయన పేరు చెరగని సంతకంలా కనిపిస్తుంది. నిజాం ప్రభువుకు విశ్వాసపాత్రుడిగా ఉంటూనే, హైదరాబాద్ నగర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి తన వంతు సేవ చేసిన ప్రజాబంధువు ఆయన. అధికారాన్ని పదవిగా కాకుండా ప్రజాసేవకు ఒక అవకాశంగా భావించిన అరుదైన వ్యక్తిత్వం వెంకట రామారెడ్డిది. నిజాం రాజుల ఏడు తరాల పాలనలో హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ (కొత్వాల్) పదవిని అలంకరించిన తొలి హిందువుగా ఆయన చరిత్రలో నిలిచారు.**

**1869 ఆగస్టు 22న** వనపర్తి ప్రాంతంలోని ఒక చిన్న గ్రామంలో కేశవరావు, జారమ్మ దంపతులకు జన్మించిన వెంకట రామారెడ్డి చిన్నతనంలోనే తల్లిని కోల్పోయారు. తొమ్మిదేళ్ల వరకు రాయణిపేటలో అమ్మమ్మ కిష్టమ్మ సంరక్షణలో పెరిగారు. చిన్ననాట ఖాస్గీ పాఠశాలలో భారత, భాగవతాలను అభ్యసించారు. అనంతరం వనపర్తి పాఠశాలలో నాలుగేళ్లపాటు ఉర్దూ, ఫార్సీ భాషలను నేర్చుకున్నారు. విలియం వాహబ్ వద్ద కన్నడ, మరాఠీ భాషలను కూడా అభ్యసించారు. 1886లో నజర్ మహమ్మద్ సహాయంతో ముదిగ్లు ఠాణాలో అమీన్ (సబ్ ఇన్‌స్పెక్టర్)గా పోలీసు శాఖలో అడుగుపెట్టారు. నిజాం సొంత సంస్థాన ఆస్తుల వ్యవహారాల్లో కొంతకాలం ప్రత్యేక అధికారిగా పనిచేశారు. నిజాయితీ, సమర్థత, విధినిర్వహణలో చాకచక్యంతో ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారు. ఫలితంగా అనతికాలంలోనే పదోన్నతులు లభించాయి. మహబూబ్‌నగర్, నిజామాబాద్, కరీంనగర్, గుల్బర్గా, అత్రాఫ్ బల్దా (ప్రస్తుత రంగారెడ్డి) ప్రాంతాల్లో పోలీసు అధికారిగా విధులు నిర్వహించారు. ఆ తర్వాత హైదరాబాద్ నగరంలో నాయెబ్ కొత్వాల్‌గా నియమితులై, అనంతరం కొత్వాల్ పదవిని చేపట్టారు. వేల్స్ యువరాజు హైదరాబాద్ పర్యటనకు వచ్చినప్పుడు భద్రతా ఏర్పాట్లను సమర్థంగా నిర్వహించి ప్రత్యేక గుర్తింపు పొందారు. దాదాపు పద్నాలుగు సంవత్సరాలపాటు హైదరాబాద్ నగర పోలీసు వ్యవస్థకు నాయకత్వం వహించిన ఆయన 1933 ఏప్రిల్‌లో పదవీ విరమణ చేశారు. అయితే వెంకట రామారెడ్డి సేవలు పోలీసు శాఖకే పరిమితం కాలేదు. విద్య, సాహిత్యం, గ్రంథాలయాలు, సామాజిక సేవ వంటి అనేక రంగాలకు ఆయన అండగా నిలిచారు. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం, వేమనాంధ్ర భాషా నిలయం, బాలసరస్వతి గ్రంథాలయం వంటి సంస్థల అభివృద్ధికి సహకరించారు. 1946లో జరిగిన 26వ ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ మహాసభకు అధ్యక్షత వహించారు. తెలంగాణలో విద్యావ్యాప్తికి ఆయన చేసిన కృషి ప్రత్యేకంగా గుర్తించాల్సినది. గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతో హైదరాబాద్‌లో రెడ్డి విద్యార్థి వసతి గృహాన్ని స్థాపించారు. గద్వాల మహారాణి, వనపర్తి రాజా, పింగళి కోదండరాం రెడ్డి, గోపాలపేట, దోమకొండ, జటప్రోలు సంస్థానాధీశులు తదితరుల నుంచి విరాళాలు సేకరించి తొలుత అద్దె భవనంలో హాస్టల్‌ను ప్రారంభించారు. అనంతరం 1918లో అబిడ్స్‌లోని ప్రస్తుత భవనంలోకి మార్చారు.

రెడ్డి హాస్టల్ కేవలం విద్యార్థులకు వసతి కల్పించే స్థావరంగా మిగలలేదు. తెలంగాణలో విద్యా వ్యాప్తితోపాటు సామాజిక, సాంస్కృతిక, రాజకీయ చైతన్యానికి కూడా అది ఒక కేంద్రంగా మారింది. అనేక మంది విద్యావంతులు, రచయితలు, ప్రజా నాయకులు ఈ వాతావరణం నుంచి వెలుగులోకి వచ్చారు. మాతృభాష పట్ల జరుగుతున్న నిరాదరణను గమనించిన వెంకట రామారెడ్డి తెలుగు భాషా వికాసానికి కూడా తనవంతు కృషి చేశారు. 1943 మే 26న రెడ్డి హాస్టల్ గ్రంథాలయంలో ప్రముఖ పండితులు, భాషాభిమానులు, కవులు, రచయితలు సమావేశమై తెలుగు భాషా సంస్కృతుల ప్రచారాన్ని ప్రధాన లక్ష్యంగా ఒక సంస్థను స్థాపించాలని నిర్ణయించారు. దాని ఫలితంగానే 'నిజాం రాష్ట్ర ఆంధ్ర సారస్వత పరిషత్తు' ఏర్పడింది. పరిషత్తు ద్వితీయ మహాసభలు 1944 డిసెంబర్ 28, 29, 30 తేదీల్లో ఓరుగల్లులో జరిగాయి. ఈ మహాసభలను రాజాబహద్దూర్ వెంకట రామారెడ్డి ప్రారంభించారు. సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షత వహించారు. 1946 మార్చి 15, 16, 17 తేదీల్లో జరిగిన తృతీయ మహాసభలను కూడా వెంకట రామారెడ్డి ప్రారంభించారు. నారాయణగూడ ఆంధ్ర బాలికోన్నత పాఠశాలకు ఆయన చాలాకాలం అధ్యక్షుడిగా పనిచేశారు. ఆంధ్ర విద్యాలయ కార్యవర్గానికి జీవితాంతం అధ్యక్షుడిగా కొనసాగారు. 1926లో 'గోలకొండ పత్రిక' స్థాపనకు కూడా ఆయన ముఖ్యంగా తోడ్పడ్డారు. ఆయన సహాయం పొందని తెలుగు సంస్థ లేదంటే అతిశయోక్తి కాదు. సామాజిక సేవలోనూ ఆయనది ప్రత్యేకమైన ముద్ర. హరిజనోద్ధరణ కోసం పనిచేసిన సంస్థలు, అనాథ బాలల ఆశ్రమాలు, కుష్ఠు నివారణ సంఘం, జంతు హింసా నివారణ సమితి వంటి అనేక సంస్థలకు ఆయన ఉదారంగా ఆర్థిక సహాయం అందించారు. మహిళల విద్యకు కూడా ప్రాధాన్యమిచ్చారు. 1933లో నారాయణగూడలో రెడ్డి బాలికల హాస్టల్ ఏర్పాటుకు కృషి చేశారు. అనంతరం ఆయన పేరుతో రెడ్డి మహిళా కళాశాల కూడా స్థాపించబడింది. ఆయన ప్రజాసేవకు గుర్తింపుగా నిజాం రాజు జన్మదినోత్సవం సందర్భంగా 1921లో 'రాజా బహద్దూర్' బిరుదును ప్రదానం చేశారు. బ్రిటిష్ ప్రభుత్వం 1931లో 'ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్' గౌరవాన్ని అందించింది. అధికారం చేతిలో ఉన్నప్పుడు ప్రజలకు సేవ చేయడం ఒక బాధ్యత. కానీ అధికారం నుంచి తప్పుకున్న తర్వాత కూడా ప్రజల కోసం పనిచేయడం ఒక ఆదర్శం. వెంకట రామారెడ్డి జీవితంలో ఈ రెండూ కనిపిస్తాయి. పోలీసు అధికారిగా క్రమశిక్షణకు ప్రతీకగా నిలిచిన ఆయన, ప్రజాసేవకుడిగా విద్య, భాష, సాహిత్యం, సామాజిక అభ్యున్నతికి అండగా నిలిచారు. ఆయన సేవలకు గుర్తుగా హైదరాబాద్ నారాయణగూడ చౌరస్తాలో కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆయన పేరుతో మహిళా కళాశాల ఏర్పాటైంది. ఆయన పేరిట ఏర్పాటైన ట్రస్టు ద్వారా హైదరాబాద్, సైబరాబాద్ తదితర పోలీసు కమిషనరేట్ల పరిధిలో విధుల్లో ప్రతిభ కనబరిచే పోలీసు అధికారులకు 'రాజాబహద్దూర్ వెంకట రామారెడ్డి అవార్డు' అందజేస్తున్నారు. 1869 ఆగస్టు 22న జన్మించిన ఈ మహనీయుడు 1953 జనవరి 25న పరమపదించారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని దోమలగూడ ప్రాంతంలో ఆయన సమాధి ఉంది. వెంకట రామారెడ్డి జీవితం ఒక ప్రశ్నను మన ముందుంచుతుంది. పదవి మనిషికి గౌరవాన్ని ఇస్తుందా? లేక మనిషి తన సేవలతో పదవికి గౌరవాన్ని తెస్తాడా? వెంకట రామారెడ్డి విషయంలో రెండో మాటే నిజం. కొత్వాల్‌గా ఆయన హైదరాబాద్ నగరానికి సేవ చేశారు. ప్రజాబంధువుగా ఒక తరాన్ని తీర్చిదిద్దారు. విద్య, భాష, సాహిత్యం, సామాజిక సేవలకు అండగా నిలిచి భవిష్యత్ తరాలకు ఒక మార్గాన్ని చూపించారు.



**రామ కిష్టయ్య సంగన భట్ల**
సీనియర్ జర్నలిస్టు
ఫోన్ నంబర్: 9440595494

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.